


# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 11 ఫిబ్రవరి 2022 సంపుటి : 03 సంచిక : 159 పేజీలు : 4 వెల : రూ 3-00


# సినీ ప్రముఖులతో భేటీ.. సీఎం జగన్ ఏమన్నారంటే..?



అమరావతి: తెలుగు సినిమా ప్రముఖులతో తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం భేటీ అయ్యారు. సినీనటుడు చిరంజీవి, మహేష్‌బాబు, ప్రభాస్, రాజమౌళి, అలీ, ఆర్. నారాయణమూర్తి, పోసాని కృష్ణమురళి, కొరటాల శివ, నిరంజన్ రెడ్డి, మహి రాఘవ ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఐఅండ్ పీఆర్, సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్, ఐఅండ్ పీఆర్ కమిషనర్, ఎఫ్‌డిసీ ఎండీ టి విజయ్‌కుమార్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఏమన్నారంటే... :"మంచి పాలసీ తీసుకురావాలని, తద్వారా పెద్ద సినిమాలకు, చిన్న సినిమాలకు న్యాయం జరగాలని గత కొద్ది కాలంగా కసరత్తు జరుగుతుంది. ఇందులో భాగంగానే అందరి అభ్యర్ధనలను పరిగణలోకి తీసుకుంటూ... దీనిపై ఒక కమిటీని కూడా నియమించాం. ఆ కమిటీ కూడా తరచూ సమావేశమవుతూ వాళ్లకొచ్చిన ఫీడ్ బ్యాక్ కూడా నాతో పంచుకున్నారు.ఇంకా విస్తృతంగా తెలుసుకునేందుకు మిమ్మల్ని కూడా రమ్మని చెప్పాం. సినిమా పరిశ్రమలో ఉన్న కొన్ని కొన్ని లోపాలను పూర్తిగా సరిదిద్దుకుని.. ఇండస్ట్రీ నిలబడ్డానికి ఒక మంచి వ్యవస్ధను క్రియేట్ చేసుకునేందుకు తపన, తాపత్రయంతోనే అడుగులు పడ్డాయి. మీరన్నట్టుగా ఏ సినిమాకైనా, ఎవరి సినిమాకైనా ఒకే రేటు ఉండాలి. ప్రాథమికంగా ఒక ప్రాతిపదిక లేనంతవరకు... కొద్దిమందికి ఎక్కువ వసూలు చేయడం, కొద్దిమందికి తక్కువ వసూలు చేయడం అనేది ఉంటుంది. ఈ పాయింట్‌ను కూడా చర్చించాను. నేను, చిరంజీవి అన్న ఇద్దరం కలిసి

**అందరికీ న్యాయం జరిగేలా టికెట్ ధరలు**

**ఏపీలో సినిమా పరిశ్రమ నిలబడేలా అన్నిరకాల ప్రోత్సాహకాలు**

**సినిమా పరిశ్రమకు స్టూడియోలతో పాటు ఇళ్ల స్థలాలు కూడా ఇస్తాం**

**పెద్ద సినిమా, చిన్న సినిమా ఏదైనా ఐదో షోకు అనుమతి ఇస్తాం**

**సినీ ప్రముఖుల భేటీలో సీఎం వైఎస్ జగన్**



కూర్చుని దీనిపై చాలాసేపు విస్తృతంగా చర్చించాం. మంచి ధరలు తీసుకురావడం జరిగింది. ఇవి ఎవరికైనా కూడా మంచి రేట్లే... అందరికీ న్యాయం జరిగేలా మంచి ధరలు తీసుకొచ్చే ప్రయత్నం చేశాం. హీరో పారితోషకం, హీరోయిన్ పారితోషకం, దర్శకుడు పారితోషం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండానే నిర్మాణవ్యయం పరంగా కొన్ని భారీ బడ్జెట్ సినిమాలు కూడా ఉన్నాయి. ఈ తరహా సినిమాలు చేయడంలో రాజమౌళి నిపుణుడు. అటువంటి వాటిని ప్రత్యేకంగా చూడాలి. అలా ప్రత్యేకంగా చూడకపోతే భారీ టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఖర్చుతో చేయడానికి ఎవరూ ముందుకురారు. హీరో, హీరోయిన్, డైరెక్టర్ రెమ్యునరేషన్ కాకుండా, వీటిని పక్కన పెట్టి కేవలం సినిమా కోసమే రూ.100 కోట్లు కంటే ఎక్కువ ఖర్చు అయిన భారీ బడ్జెట్ సినిమాలును ప్రత్యేకంగా ట్రీట్ చేయాలి. అటువంటి వాటికి వారం రోజుల పాటు కచ్చితంగా ప్రత్యేక ధరలు నోటిపై చేసే విధంగా ట్రీట్ చేయాలని చెప్పాం. ఇక్కడ కూడా రాష్ట్రంలో షూటింగ్‌లు ప్రమోట్ చేయడం కోసం కొంత పర్సెంటేజ్ కేటాయించాం. ఏపీలో సినిమా షూటింగ్‌లు ప్రమోట్ చేయడం కోసం... ఇక్కడ షూటింగ్‌లు జరిపి ఉండాలి అన్న నిబంధనను తీసుకురాగలిగితే ఇక్కడ కూడా షూటింగ్‌లు పెరుగుతాయి. కనీసం ఎంత శాతం షూటింగ్ ఆంధ్రప్రదేశ్‌లో చేయాలన్న దానిపై ఇప్పటికే మంత్రి పేర్ని నాని దర్శకులు, నిర్మాతలతో మాట్లాడారు. వారందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని నాతో కనీసం 20 శాతం పెడతాము అని చెప్పారు. రేట్లకు సంబంధించినంత వరకు... అందరికీ ఒకటే రేట్లు. ఆన్లైన్ పద్ధతిలో టిక్కెట్లు విక్రయం ప్రభుత్వానికి మంచిది, సినిమా ప్రొడ్యూసర్లకు కూడా మంచిది అన్న కోణంలో చూశాం. ఓటీటీలతో పోటీపడాల్సిన పరిస్థితిలో సమతుల్యత కూడా ఉండాలని చర్చించాం. ఏడాదికి వేయిరూపాయలతో అమెజాన్ ఇస్తుంది. నెలకు సగటున రూ.80లు పడుతుంది. దీన్నికూడా దృష్టిలో ఉంచుకోవాలి. చిరంజీవిగారితో కూడా సుదీర్ఘంగా ఇదే విషయంపై చర్చించాం. అలాగే కనీస ఆదాయాలు రాకపోతే సినిమాలు తీసే పరిస్థితి కూడా తగ్గిపోతుంది. దాన్ని కూడా సమతుల్యం చేసుకుని సినిమాలు తీసే పరిస్థితి ఎలా అన్న ఆలోచనతో రీజనబుల్‌రేట్లు దిశగా వెళ్లాం. సినిమా చూసే ప్రేక్షకులకు భారంకాకుండా, ఆ రేట్లు సినిమా పరిశ్రమను పెంపొందించేలా ఉండేలా రేట్లను మార్పు చేశాం. మరొక్క అంశం...మీరు ఐదో షోను కూడా తీసుకురావాలని అడిగారు. సినిమా శుక్రవారం, శనివారం, ఆదివారం.. ఆ తర్వాత వారం ఆడగలిగితే సూపర్‌హిట్ అవుతుంది. ఆ పాయింట్ అర్ధం చేసుకున్నాం. అదే సమయంలో అది అందరికీ వర్తిస్తుంది. చిన్న సినిమాలకు అవే రేట్లు వర్తిస్తాయి. వారిక్కూడా మంచి ఆదాయాలు వస్తాయి. ఐదో ఆట వల్ల ఇండస్ట్రీకి కూడా మేలు జరుగుతుంది. మల్టీప్లెక్స్‌లును కూడా మంచి ధరలతో ట్రీట్ చేయడం జరుగుతుంది. మీరు చెప్పిన అన్ని విషయాలను మనసులో పెట్టుకున్నా. మీ అందరికీ సంతోషం కలిగించినందుకు ఆనందంగా ఉంది.నెమ్మదిగా సినీపరిశ్రమకూడా విశాఖపట్నం రావాలి. అందరికీ విశాఖపట్నంలో స్థలాలు ఇస్తా. నెమ్మదిగా ఇక్కడ కూడా దృష్టిపెట్టండి. తెలంగాణాతో పోలిస్తే ఫిల్మ్ ఇండస్ట్రీకి ఆంధ్రా ఎక్కువ కంట్రిబ్యూట్ చేస్తోంది. తెలంగాణా 35 నుంచి 40 శాతం కంట్రిబ్యూట్ చేస్తోంది. ఆంధ్రా 60 శాతం వరకు కంట్రిబ్యూట్ చేస్తోంది. ఏపీలో జనాభా ఎక్కువ, ప్రేక్షకులు ఎక్కువ, థియేటర్లు కూడా ఎక్కువ. ఆదాయపరంగా కూడా ఏపీ ఎక్కువ. వాతావరణం కూడా బాగుంటుంది. అందరికీ స్థలాలు ఇస్తాం. స్టూడియోలు పెట్టేందుకు ఆశక్తి చూపిస్తే వాళ్లకు కూడా విశాఖలో స్థలాలు ఇస్తాం. జూబ్లీహిల్స్ తరహా ప్రాంతాన్ని క్రియేట్ చేద్దాం.విశాఖ బిగ్గెస్ట్‌సిటీ. కాస్త పుష్‌చేయగలిగే అవకాశాలున్న సిటీ విశాఖపట్నం. చైన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌లతో విశాఖపట్నం పోటీపడగలదు. మనం ఓన్ చేసుకోవాలి, మనందరం అక్కడకి వెళ్లాలి... అప్పుడే విశాఖపట్నం, ఇవాళ కాకపోయినా పదేళ్లకో, పదిహేనేళ్లకో.. మహానగరాలతో పోటీపడుతుంది. దీనికి ముందడుగు పడాలంటే.. సినిమా పరిశ్రమ విశాఖ వెళ్లేందుకు అడుగులు పడాలి. అందరూ దీన్ని పరిగణలోకి తీసుకోవాలి. అందరికీ స్థలాలు ఇస్తా... ఇళ్లస్థలాలతోపాటు, స్టూడియో స్థలాలు కూడా ఇస్తానని నా వైపు నుంచి విజ్ఞప్తి చేస్తున్నాను. రాజమౌళి మంచి సినిమాలు, పెద్ద సినిమాలు తీయాలి. చిన్న సినిమాలను కూడా రక్షించుకోవాలి. దీనికోసం కార్యాచరణ చేసుకోవాలని కోరుతున్నాను. సినిమా క్లిక్ కావాలంటే పండగ రోజు రిలీజ్ చేస్తే హిట్ అవుతుందని అందరికీ తెలుసు. ఇక్కడే చిన్నసినిమాను రక్షించుకోవడానికి కూడా కొంత సమతుల్యత అవసరం. పరిశ్రమనుంచే దీనికి తగిన కార్యాచరణ ఉండాలని కోరుతున్నాం. ఆ పండగ రోజు మాకు అవకాశాలు లేవని చిన్నసినిమా వాళ్లు అనుకోకుండా... కాస్త సమతుల్యత పాటించాలని విజ్ఞప్తి. ఈ విషయంలో కలిసి పనిచేద్దాం. వాళు కూడా పరిశ్రమలో భాగమే. వాళ్లనూ భాగస్వామ్యులు చేయాలని" సీఎం జగన్ అన్నారు.

# బాధితురాలైన ప్రతి ముస్లిం మహిళకు భాజపా ప్రభుత్వం అండగా నిలుస్తోంది: ప్రధాని




లక్నో: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారం చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సహరాన్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ బాధితురాలైన ప్రతి ముస్లిం మహిళకు బీజేపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

ప్రతిపక్షాలు తమ హక్కులను కాపాడుకోవడానికి, ఓట్ల కోసం అనేక మార్గాలను అన్వేషిస్తున్నాయని మోదీ అన్నారు. ముస్లిం కుమార్తెల జీవితం ఎప్పుడూ వెనుకబడి ఉండేలా ఆ వ్యక్తులు ముస్లిం సోదరీమణులను మోసగిస్తున్నారని మోదీ విమర్శించారు.

# టీడీపీ నీచ, దుష్ట రాజకీయాలు చేస్తోంది: ఎంపీ సుభాష్ చంద్రబోస్

న్యూఢిల్లీ: అభివృద్ధి పనులకు టీడీపీ అడ్డుపడుతుందని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మండిపడ్డారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధికి రావాల్సిన నిధులను అడ్డుకుని.. టీడీపీ నీచ, దుష్ట రాజకీయాలు చేస్తోందని నిప్పులు చెరిగారు. పేదల ఇళ్ల స్థలాలకు అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ నీచ రాజకీయాలతో ఏపీలోని పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి సైతం సముచిత పాత్ర ఉందని.. నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షానిదని సుభాష్ చంద్రబోస్ హితవు పలికారు. చంద్రబాబు నేతృత్వంలోని ప్రతిపక్షం అభివృద్ధికి అడ్డుపుల్ల వేయడమే పనిగాపెట్టుకుందని మండిపడ్డారు. ఇందుకు పావుగా ఎంపీ రఘురామకృష్ణరాజును ఉపయోగించుకుంటున్నారన్నారు."హడ్కో రుణాల మంజూరు నిలుపుదల చేయించాలంటూ ఆయనతో ఒక పిటిషన్ పెట్టించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ఎలాగైనా ఆపించాలని ప్రయత్ని స్తున్నారు. గృహ నిర్మాణానికి రావాల్సిన



నిధులు రాకుండా అడ్డుకోవడంలోనూ ప్రధాన పాత్ర పోషించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిన ఉద్దేశం ఉపాధి కల్పన, మనీ సర్క్యులేషన్‌లో ఉంచడమే. ఇందులో ఎంతమందికి పని కల్పించామన్నదే ముఖ్యం తప్ప, ఎంత పని జరిగిందన్నది ముఖ్యం కాదు. పేదవాడి ఇంటిస్థలాన్ని చదును చేయడానికి ఈ పథకాన్ని ఒప్పుకోకపోవడం దురదృష్టకరం. చంద్రబాబు, రఘురామకృష్ణ రాజు ఇద్దరూ కలిసి పిటిషన్లు పెట్టి స్టే తీసుకొచ్చారు. పేదవారిపై వీరికున్న చిత్తశుద్ధి ఏంటో దీన్నిబట్టి అర్థమవుతుందని" సుభాష్ చంద్రబోస్ అన్నారు.

# చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తాం: పేర్ని నాని



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని సినిమాటోగ్రఫీశాఖ మంత్రి పేర్ని నాని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సినీ ప్రముఖులు భేటీ ముగిసింది. అనంతరం పేర్ని నాని మీడియాతో మాట్లాడుతూ.. చిన్న సినిమాకు ఒక స్థానం ఉండేలా చూడాలని సినీ ప్రముఖులు కోరినట్లు తెలిపారు. సినీ పరిశ్రమకు అండగా ఉంటానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఏం కావాలన్నా సహకారం అందిస్తామని సీఎం జగన్ చెప్పారని తెలిపారు.మెగాస్టార్ చిరంజీవి అందర్నీ సమన్వయం చేశారని పేర్కొన్నారు. సినీ పరిశ్రమ సమస్యలపై కమిటీ కూడా వేశామని గుర్తుచేశారు. సినీ పరిశ్రమ ప్రముఖులు అందురూ కూడా ప్రతి సమస్యను సీఎం వైఎస్ జగన్‌తో చర్చించారని పేర్కొన్నారు.హీరో చిరంజీవి.. సినీ పరిశ్రమ సమస్యలన్నీ సీఎం జగన్ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. సుమారు గంటకు పైగా జరిగిన సమావేశంలో.. చిరంజీవి, ప్రభాస్, మహేశ్‌బాబు, రాజమౌళి, కొరటాల శివ, పోసాని కృష్ణమురళి, ఆర్ నారాయణ మూర్తి, నిరంజన్ రెడ్డి, అలీ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

# విజయ్ మాల్యాకు ఇదే చివరి అవకాశం : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : బ్యాంకు రుణాల ఎగవేతదారు విజయ్ మాల్యాకు సుప్రీంకోర్టు చిట్ట చివరి అవకాశాన్ని ఇచ్చింది. వ్యక్తిగతంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ తన వాదనలను రెండు వారాల్లోగా వినిపించాలని చెప్పింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 24న జరుగుతుందని పేర్కొంది. తన వాదనలను వినిపించడంలో విఫలమైతే కోర్టు ధిక్కార నేరం క్రింద కేసును ఎదుర్కొనాలని తెలిపింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, బ్రిటన్‌లో ఏదో రహస్యంగా జరుగుతోందనేది భారత ప్రభుత్వ వాదన కాదని, ఏదో జరుగుతోందని, ఆ సమాచారాన్ని పంచుకోవడం సాధ్యం కాదని బ్రిటన్ ప్రభుత్వమే భారత ప్రభుత్వానికి చెప్పిందని తెలిపారు. మాల్యా దాదాపు రూ.9 వేల కోట్ల మేరకు బ్యాంకు రుణాలను ఎగవేసి, బ్రిటన్ వెళ్ళిపోయిన సంగతి తెలిసిందే. ఆయన 40 మిలియన్ డాలర్లను తన పిల్లలకు బదిలీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి ఈ లావాదేవీని జరిపారు. దీంతో ఆయన కోర్టు ధిక్కార నేరానికి పాల్పడినట్లు అత్యున్నత న్యాయస్థానం నిర్ధరించింది. ఆయన హాజరుకావాలని అనేకసార్లు ఆదేశించింది. బ్రిటన్‌లోని అత్యున్నత న్యాయస్థానం విజయ్ మాల్యాను భారత దేశానికి అప్పగించాలని తీర్పు చెప్పిందని, అయితే ఆ దేశ ప్రభుత్వం ఆ తీర్పును అమలు చేయడం లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. బ్రిటన్‌లో రహస్యంగా ఏం జరుగుతోందో తెలియదని చెప్పింది.

# ట్రాఫిక్ జామ్ ఘటనలు మళ్లీ రిపీట్ కావొద్దు: సీఎం జగన్

అమరావతి: విశాఖపట్నం పర్యటనలో ట్రాఫిక్ జామ్ ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీ శారదా పీఠం సందర్శనలో భాగంగా సీఎం వైఎస్ జగన్ బుధవారం విశాఖపట్నంలో పర్యటించిన విషయం తెలిసిందే. అయితే సీఎం పర్యటన సందర్భంగా.. నగరంలో గంటల తరబడి అధికారులు ట్రాఫిక్ ఆంక్షలను విధించారు.దీనిపై సీఎం జగన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. వెంటనే విచారణ చేపట్టాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. గంటల తరబడి ట్రాఫిక్ ఎందుకు నిలిపేశారని అధికారులను ప్రశ్నించారు. ప్రజలను ఎందుకు ఇబ్బందులకు గురిచేశారని అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కారాదని ఆయన స్పష్టం చేశారు.



# ఏపీ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

అమరావతి: ఆంధ్రప్రదేశ్ పదో తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ గురువారం విడుదలైంది. టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూలను మంత్రులు ఆదిమూలపు సురేష్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విడుదల చేశారు.ఇంటర్మీడియట్ పరిక్షల షెడ్యూల్:మార్చి 11 నుంచి 31 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరిక్షలు, ఏప్రిల్ 8 నుండి 28 వరకు ఇంటర్మీడియట్ బోర్డు పరిక్షలు జరుగుతాయని ఏపి విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు.1456 సెంటర్లలో ఈ పరిక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి సంవత్సరం 5,05,052 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 4,81,481 విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. మొత్తం 9,86,533 మంది విద్యార్థులు ఈ పరిక్షలు రాయనున్నారని తెలిపారు.పదో తరగతి పరిక్షల షెడ్యూల్:టెన్త్ పరిక్షల తేదీలను మంత్రి ఆదిమూలపు సురేష్ విడుదల చేశారు. 2022 సంవత్సరం



మే 2 నుంచి మే13 వరకు పదో తరగతి పరిక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మొత్తం 6,39,805 మంది విద్యార్థులు పదోతరగతి పరిక్షలు రాయనున్నారని తెలిపారు.

# సంపాదకీయం

శుక్రవారం 11 ఫిబ్రవరి 2022

## మేఘాలయలో రాజకీయాలు

ఓ వైపు అయిదు రాష్ట్రాల అసెంబ్లీలకు జరుగుతున్న ఎన్నికలు.. ఇంకోవైపు పార్లమెంటు వేదికగా ఘాటైన విమర్శలు, ప్రతి విమర్శలు.. ఇవన్నీ చూస్తే కాంగ్రెస్, బీజేపీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో వైరం కొనసాగుతున్నట్లుగా అందరూ భావిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 7, 8 తేదీలలో లోక్‌సభ, రాజ్యసభల సాక్షిగా కాంగ్రెస్ పార్టీని చెడుగుడు ఆడుతూ చేసిన ప్రసంగాలను ఎవరు మరిచిపోలేరు. అంతకు ముందు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, అధిర్ రంజన్ తదితరులు చేసిన ప్రసంగాలలో బీజేపీని, ఎన్డీయే ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టడాన్ని కూడా ఎవరు సమీప భవిష్యత్తులో మరువలేరు. ఈ క్రమంలో ఈశాన్య భారతంలో చోటుచేసుకున్న ఓ రాజకీయ పరిణామం కేవలం రాజకీయ పరిశీలకులనే కాదు.. కాస్తో కూస్తో రాజకీయ పరిజ్ఞానం వున్న వారందరినీ కూడా ఆశ్చర్యపరిచింది. యావత్ దేశవ్యాప్తంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రత్యర్థి పార్టీలుగానే అందరికీ తెలుసు. కానీ ఓ ఈశాన్య రాష్ట్రంలో మాత్రం విచిత్ర పరిణామం చోటుచేసుకుంది. పరస్పరం విరుద్ధ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకే రాజకీయ కూటమిలో చేరడం ఓ విచిత్ర పరిణామంగా చెప్పుకుంటున్నారు. కొన్ని చోట్ల గ్రామ పంచాయితీలు, మండల పరిషత్తులు.. ఇంకా వీలైతే మునిసిపాలిటీలలో కాంగ్రెస్, బీజేపీలే కాకుండా మిగిలిన ప్రధాన పార్టీలు సైతం జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ వైరాన్ని పక్కన పెట్టి.. స్థానికంగా పొత్తులు పెట్టుకున్న సంగతులు, పరస్పరం పదవుల కోసం సహకరించుకున్న పరిస్థితులను గతంలో చూశాం. కానీ ఏకంగా రాష్ట్రస్థాయిలో బీజేపీ, కాంగ్రెస్ జతకట్టడంతోపాటు ఒకే ప్రభుత్వంలో భాగస్తులైన ఉదంతం మేఘాలయాలో చోటుచేసుకుంది.పరస్పరం పూర్తి వైరం కలిగిన పార్టీలు మేఘాలయాలో ఒకే రాజకీయ కూటమిలో చేరాయి. చేరడమే కాదు.. ఏకంగా రెండు పార్టీలు అధికారాన్ని పంచుకోబోతున్నాయి కూడా. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలు ఫిబ్రవరి 9న అక్కడ అధికారంలో వున్న మేఘాలయ డెమోక్రటిక్ అలయన్స్‌కు మద్దతు ప్రకటించారు. మద్దతు ప్రకటించడంతోపాటు ఏకంగా ప్రభుత్వంలో చేరేందుకు ముందుకొచ్చారు. ఈ కూటమికి నేషనల్ పీపుల్స్ పార్టీ నాయకత్వం వహిస్తుండగా.. ఆ కూటమిలో భారతీయ జనతా పార్టీ కూడా మిత్రపక్షంగా ఉంది. లేటెస్టుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా ఆ కూటమిలో చేరడంతో.. కమలం పార్టీతో హస్తం పార్టీ జతకట్టినట్లయ్యింది. 60 మంది సభ్యులున్న మేఘాలయా అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 21 చోట్ల విజయం సాధించింది. ఎన్‌పీపీకి 20 సీట్లు వచ్చాయి. భారతీయ జనతా పార్టీ కేవలం 2 సీట్లకే పరిమితమైంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ..బీజేపీ, ఇతర చిన్న పార్టీలతో ఎన్‌పీపీ సారథ్యంలో మేఘాలయ

డెమోక్రటిక్ అలియన్స్ ఏర్పాటై.. అధికారాన్ని హస్తగతం చేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యేకు మంత్రి పదవికూడా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా మారింది. అయితే తదనంతర కాలంలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా పార్టీకి గుడ్‌బై చెబుతూ వచ్చారు.మరో ఆశ్చర్యకరమైన పరిణామం ఏంటంటే.. గత ఎన్నికల్లో రాష్ట్రంలో అస్సలు పోటీ చేయని తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం మేఘాలయాలో ప్రధాన ప్రతిపక్షంగా మారింది. దానికి కారణం కాంగ్రెస్ సీనియర్ నేత 12 మంది ఎమ్మెల్యేలతో కలిటీఎంసీలో చేరడమే. 2021 నవంబరులో మాజీ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా సహా 12 మంది శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీని వీడి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో మేఘాలయా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ.. రాత్రికి రాత్రే టీఎంసీ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా మారిపోయింది. ఆ పరిణామం తర్వాత కాంగ్రెస్ పార్టీకి కేవలం అయిదుగురు శాసనసభ్యులు మాత్రమే మిగిలారు. ఇక తాజాగా ఫిబ్రవరి 9న మిగిలిన అయిదుగురు ఎమ్మెల్యేలు మేఘాలయ డెమొక్రాటిక్ అలయెన్స్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతు స్పీకర్‌కు లేఖ అందించారు. అయిదుగురు సభ్యులతో కూడిన కాంగ్రెస్ శాసన సభా పక్షం ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాను కలిసి మద్దతు లేఖను ఆయనకు కూడా అందజేశారు. ఎండిఏలో చేరుతున్నట్లు.. ప్రభుత్వంలోను భాగస్వాములు అవుతున్నట్లు వారు వెల్లడించారు. దాంతో ఎండిఏ కూటమి సారథ్యంలోని మేఘాలయా రాష్ట్ర ప్రభుత్వంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కొనసాగబోతున్నాయి. అయితే, ఈ పరిణామానికి, సీఎల్పీ నిర్ణయానికి కాంగ్రెస్ అధిష్టానం ఆమోదం వుందా లేదా అన్నది తేలాల్సి వుంది.

# అప్పు పుట్టినా... ఓవర్ డ్రాఫ్ట్ క్రిందా చెల్లు...

విజయవాడ, ఫిబ్రవరి 10, (న్యూస్ పల్స్)జగన్ రెడ్డి సర్కార్ ఆంధ్రప్రదేశ్‌ను నిండా అప్పుల్లో ముంచేసింది. ఇంకా ఎడా పెడా అప్పులు చేస్తూనే ఉంది. సెక్యూరిటీల వేలంలో 2 వేల కోట్ల రూపాయలు రుణం తీసుకున్నా ఏపీ చేతికి చిప్పే మిగిలింది. ఆ మొత్తం సొమ్మంతా ఓవర్ డ్రాఫ్ట్ కింద రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకే జమ చేయాల్సి వచ్చింది. గడచిన ఆరు వారాల్లో ఏపీ 4 వేల 500 కోట్ల రూపాయల అప్పుగా తీసుకుంది. అయినా కాసుల కోసం ఏపీ సర్కార్ ఎక్కని మెట్టూ లేదు.. దిగని గుమ్మం లేదు. తప్పుడు మార్గాల్లో అప్పుల మీద అప్పులు చేస్తున్న జగన్ రెడ్డి సర్కార్ కు ఎన్ని కోట్లు అప్పులు దొరికినా ఇంకా చాలడంలేదు. ఇంకా.. ఇంకా కావాలంటూ ప్రతిచోటా దేబిరిస్తూనే ఉంది. 'మాకు అప్పులు ఇవ్వండి.. అదనపు అప్పులకు అనుమతి ఇవ్వండి.. మా అప్పులకు అడ్డు లేకుండా చూడండి' అంటూ జగన్ రెడ్డి సర్కార్ కేంద్రం ముందు ప్రతి క్షణమూ మోకరిల్లుతూనే ఉందివాస్తవానికి జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు 27 వేల 325 కోట్ల అదనపు అప్పులు తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని సీఎం జగన్ కోరారు. ఈ విషయం పార్లమెంట్ సాక్షిగా కేంద్రం వెల్లడించడం గమనార్హం. అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లుగా జగన్ రెడ్డి సర్కార్ అప్పుల కోసం వెంపర్లాడుతూనే ఉంది. అలా చేసిన అప్పుల అసలు, వడ్డీలు చెల్లించేందుకే రాష్ట్ర ఖజానా సరిపోవడం లేదట. రాజకీయ స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని జగన్ రెడ్డి అండ్ కో అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆర్థిక రంగ నిపుణులు అంటున్నారు. ఇప్పటికే పూర్తిగా అప్పుల్లో మునిగిపోయాం.. వాటి నుంచి బయటపడే మార్గం కనిపించడం లేదని నిపుణులు చెబుతున్నారు. 2021-22లో 42 వేల 472 కోట్లు అప్పు చేసుకునేందుకు ఏపీకి కేంద్రం అనుమతి ఇచ్చింది. అయితే.. గడిచిన మూడేళ్లలో కేంద్రం అనుమతించిన దాని కంటే 17 వేల కోట్ల రూపాయలు అదనంగా అప్పులు తెచ్చేసింది. దాంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆ 17 వేల కోట్లకు కోత వేసి 25 వేల 472 కోట్లకు మాత్రమే కేంద్రం అనుమతించిందట. ఒక్కసారిగా అంత మొత్తాన్ని కోత పెడితే భరించలేవమని, దాన్ని మూడేళ్లకు సర్దుబాటు చేయండి మహాప్రభో అంటూ కేంద్రాని రాష్ట్రం కోరింది. రాష్ట్రం వినతికి కేంద్రం ఓకే అందో లేదో స్పష్టత లేదు. అయితే.. జగన్ రెడ్డి సర్కార్ యధేచ్ఛగా అప్పులు చేసుకోడానికి కేంద్రం చేయూతనిస్తోందంటున్నారు. ఇంతవరకు తెచ్చిన అప్పులు చాలవన్నట్లు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల కోసం అదనంగా 27 వేల 325 కోట్ల అప్పు కావాలంటూ జగన్ సర్కార్ అడగడం చర్చనీయాంశంగా మారిందివైసీపీ సర్కార్ ఏ రూపంలో రుణం తీసుకోవాలని యత్నించినా అవాంతరాలు ఎదురవుతున్నాయట. విద్యుత్ రంగ సంస్కరణల కోసం అదనంగా 2 వేల 133 కోట్ల రూపాయలు అదనంగా అప్పుగా తీసుకునేందుకు పది రోజుల క్రితం కేంద్రం అనుమతించింది. దీంతో మంగళవారంనాడు సెక్యూరిటీల వేలంలో పాల్గొంది. రెండు వేల కోట్లు రుణాలుగా తీసుకుంది. ఖజానా వసూళ్లకు మించి నిధులను ఆర్బీఐ వద్ద ఏపీ వాడుకున్నందున ఆ మొత్తం 2 వేల కోట్లూ ఓడికే సర్దుబాటు చేయాల్సి వచ్చిందని సమాచారం.

రాష్ట్ర క్రెడిట్ రేటింగ్ దారుణంగా ఉండడంతో 7 పాయింట్ 37 శాతం అత్యధిక వడ్డీకి సెక్యూరిటీలను జగన్ రెడ్డి సర్కార్ వేలం వేసింది.రాష్ట్ర రాబడికి మించి ఖర్చు ఉన్నప్పుడు.. అప్పులు తీసుకునేందుకు ఆర్బీఐ పలు రకాలుగా అనుమతిస్తుంది. వాటిలో వేస్ అండ్ మీన్స్ రూపంలో నిధులు సమకూర్చుకోవచ్చు. ఆ పరిమితి మించిపోతే ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయం ఉంటుంది. ఓడీ కోటాలో తీసుకున్న నిధులన్నీ సంబంధిత వడ్డీతో తిరిగి ఆర్బీఐకి చెల్లించాలి. ఇది కూడా ఓ రకమైన అప్పు లాంటిదేనట.ఇలా ఉండగా.. ఏపీలో ఆర్థిక పరిస్థితి, ఆర్థిక సంక్షోభంపై టీడీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. జగన్ రెడ్డి సర్కార్ ఏపీని రోజు రోజుకూ అప్పుల ఊబిలో ముంచేస్తున్నారంటూ టీడీపీ ఎంపీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెచ్చిన అప్పులు చాలక జగన్ రెడ్డి సర్కార్ రాజధానిగా వద్దనుకున్న అమరావతి భూముల్ని కూడా తాకట్టు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఏపీలో రోడ్ల పరిస్థితి అస్సలు బాగోలేదు. ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం.. అంతా గోతులు, గుంతలు, రాళ్లమయం చందంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో ఏ ఒక్క రోడ్డుపైనా కనీసం గుంతలు పూడ్చ లేదని నిప్పులు చెరుగుతున్నారు. ఏపీ జనం నెత్తిన ఎన్ని వేల కోట్ల అప్పు పెట్టినా కనీస వసతులు కల్పించడం లేదని ఫైరవుతున్నారు. ఉత్పాదక రంగంపైన కాకుండా పప్పు బెల్లాల్లా కొందరికే దోచిపెట్టడం వల్లే రాష్ట్రంలో ఇప్పుడు ఇలా ఆర్థిక దుస్థితి వచ్చిందంటున్నారు. ఈ చేతకాని దద్దమ్మ సర్కార్ కు సమయం వచ్చినప్పుడు గుణపాఠం చెబుతామంటూ గుర్రుగా ఎదురు చూస్తున్నారు.

# ఉండవల్లి అంచనాలు నిజమవుతాయా..



రాజమండ్రి, ఫిబ్రవరి 10, (న్యూస్ పల్స్)ఉండవల్లి అరుణ్ కుమార్ ఒక రాజకీయ నేత మాత్రమే కాదు. ఆయన అంచనాలు నిజమవుతాయి. రాజకీయంగా ఉండవల్లి చేసే ప్రతి కామెంట్ జనంలోకి బాగా చొచ్చుకుపోతాయి. అందుకే ఉండవల్లి అరుణ్ కుమార్ కు రాజకీయ పార్టీల్లో ఒక రేంజ్ ఉన్న మేధావిగా గుర్తింపు ఉంది. 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబును రాజకీయంగా ఉండవల్లి ఇబ్బంది పెట్టారు. ఆయన చేసిన ప్రతి పనికీ ఇబ్బందికరంగా మారారు. చంద్రబాబు ఓటమికి గల కారణాల్లో ఉండవల్లి ఒకరన్నది అందరూ ఒప్పుకునే విషయమే. వైసీపీకి ఇబ్బందికరంగా ఇప్పుడు అదే ఉండవల్లి అరుణ్ కుమార్ వైసీ?పీకి ఇబ్బందికరంగా మారారు. ఇబ్బందికరమంటే ఉన్న విషయాలను కుండబద్దలు కొడుతున్నారంతే. జగన్ పాలనపై గత కొద్ది రోజులుగా ఉండవల్లి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి అప్పుల వరకూ ఆయన చేసే ప్రతి వ్యాఖ్య జగన్ సర్కార్ కు నూటిగా తగులుతుంది. సామాన్యుడికి అర్థమయ్యేలా చెబుతుండటంతో ఉండవల్లి కామెంట్స్ తో అధికార వైసీపీ ఇరుకున పడుతుంది. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న అప్పులతో భవిష్యత్ లో ప్రజలకు ఇబ్బంది తప్పదని ఉండవల్లి హెచ్చరిస్తున్నారు. పారిశ్రామికవేత్త అయిన జగన్ వద్ద ఏమైనా మంత్రదండం ఉంటే చెప్పాలని, కనీసం తన వంటి వారికైనా భరోసా ఇవ్వాలని ఉండవల్లి అరుణ్ కుమార్ కోరుతున్నారు. ఉండవల్లి విమర్శలకు వైసీపీ నుంచి ఎలాంటి రెస్పాన్స్ ఉండటం లేదు. అంటే ఉండవల్లి మాటలను వైసీపీ నేతలు కూడా అంగీకరిస్తున్నట్లే అనుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు తాజాగా ఏపీలో విద్యుత్తు కోతలు మొదలయ్యాయి. ప్రతిరోజూ విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నారు. దీనిపై కూడా ఉండవల్లి అరుణ్ కుమార్ మండిపడ్డారు. ఫిబ్రవరిలోనే ఇలా ఉంటే ఇక మార్చి నుంచి ఏపీలో విద్యుత్తు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బొగ్గు నిల్వలకు డబ్బు చెల్లించకపోవడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని ఉండవల్లి చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టును కూడా జగన్ పూర్తి చేయలేరని ఆయన అనడం చర్చనీయాంశమైంది. వైసీపీ నేతలు ఉండవల్లి వ్యాఖ్యలకు కనీసం సమాధానం ఇవ్వాల్సి ఉంది. లేకుంటే ఆయన చెప్పింది నిజమని అంగీకరించినట్లవుతుంది.

# 16 నుంచి ఉదయస్తమాన సేవా టిక్కెట్లు

తిరుమల, ఫిబ్రవరి 10, (న్యూస్ పల్స్)కలియుగ దైవం కొలువైన తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రం నిత్యం భక్తుల రద్దీతో నిండి ఉంటుంది. ఈ నేపథ్యంలో శ్రీవారి సంపన్న భక్తుల కోసం టీటీడీ శ్రీవారి ఉదయాస్తమాన సేవా టిక్కెట్లు పొందేందుకు సరికొత్త ప్రణాళిక ను రూపొందించింది. ఈ నేపథ్యంలో టీటీడీ వెబ్సైట్ కొత్త అప్లికేషన్ తీసుకొస్తుంది. ఈ నెల 16వ తేదీన టీటీడీ వెబ్ సైట్ లో అప్లికేషన్ విడుదల చేయనుంది. టీటీడీ ప్రాణదాన ట్రస్టుకు విరాళమిచ్చిన దాతలకు ప్రివిలెజ్ గా ఉదయాస్తమాన టికెట్ ను టీటీడీ కేటాయించనుంది.ప్రాణదాన ట్రస్టుకు ఎవరైనా భక్తులు రూ.1.5 కోటి విరాళమిస్తే శుక్రవారం.. రూ.1 కోటి విరాళమిస్తే మిగిలిన రోజుల్లో ఉదయాస్తమాన సేవా భాగ్యం కల్పించనుంది. అయితే శుక్రవారాల్లో కేవలం 28 ఉదయస్తమాన సేవా టికెట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఇక మిగిలిన రోజుల్లో 503 టికెట్లు ఖాళీగా ఉన్నట్లు టీటీడీ ప్రకటించింది. ఆసక్తి గాస్ల భక్తులు ఈ ఉదయస్తమాన సేవలను ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది.ఆఫ్ లైన్ ద్వారా టికెట్ బుక్ చేసుకోవాలనుకునే భక్తులు ముందుగా ఆన్ లైన్ లో రూ.5 లక్షలు టోకెన్ అడ్వాన్స్ చెల్లించాలని టీటీడీ ప్రకటించింది. అయితే ఆఫ్ లైన్ ద్వారా మిగిలిన మొత్తం చెల్లించని పక్షంలో అడ్వాన్స్ గా కట్టిన రూ.5 లక్షలు రీఫండ్ చేయమని తెలిపింది. అంతేకాదు ఒక మనిషికి ఒక టికెట్ మాత్రమే కేటాయిస్తామని టీటీడీ స్పష్టం చేసింది.వ్యక్తిగతంగా విరాళమిచ్చిన భక్తులకు 25 ఏళ్లు పాటు సంవత్సరంలో ఒక రోజు దాతతో కలిపి ఆరు గురికి ఉదయస్తమాన సేవను కల్పించనుండి. అదే ఏవైనా కంపెనీలు అయితే 20 ఏళ్ల పాటూ ఉదయస్తమాన సేవను కల్పించనుంది.శని, ఆది, సోమవారాల్లో ఉదయస్తమాన సేవ భక్తులకు సుప్రభాతం, తోమాల, కల్యాణోత్సవం, డోలోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవల్లో పాల్గొనే అవకాశం కలుగుతుందని ప్రకటించింది.మంగళ, బుధ,గురువారాల్లో టికెట్లు పొందిన భక్తులకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదల పాదపద్మారాధన (మంగళవారం), తిరుప్పావడ సేవ(గురువారం), కళ్యాణోత్సవం, డోలోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది.అదే శుక్రవారాల్లో ఉదయస్తమాన సేవా టికెట్లు కలిగిన భక్తులకు సుప్రభాతం, అభిషేకం, తోమాల, కల్యాణోత్సవం, డోలోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవల్లో పాల్గొనే అవకాశం ఇస్తోంది.

# మీడియా మీట్లతోనే సరా...

గుంటూరు, ఫిబ్రవరి 10, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈసారి ఖచ్చితంగా అధికారంలోకి రావాలిన ఆశిస్తున్నారు. ఈసారి అధికారం దక్కకపోతే పార్టీ మనుగడ కష్టమే. అందుకే చంద్రబాబు వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీని సమాయత్తం చేస్తున్నారు. అయితే ఒకప్పుడు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తప్పించి విపక్షంలో ఉన్నప్పుడు అనుబంధ సంఘాలు యాక్టివ్ గా ఉండేవి. తెలుగు మహిళ, తెలుగు యువత, తెలుగు రైతు, టీఎన్టీయూసీ ఇలా అనేక సంఘాలు ఫుల్లు యాక్టివ్ గా ఉండేవి. వాటి జాడ ....? అయితే ప్రస్తుతం అనుబంధ సంఘాల జాడ లేదనిపిస్తుంది. తెలుగు మహిళ అధ్యక్షురాలిగా వంగలపూడి అనిత ఉన్నా ఆమె మీడియా సమావేశాలకే పరిమితమవుతున్నారు. పెద్దగా ప్రభుత్వ వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న జాడ లేదు. ఇటీవల నారీ దీక్ష పేరుతో కొంత హడావిడి చేసినా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కేవలం మహిళ సంఘం పార్టీ ఉందంటే ఉన్నట్లు ఉంది. ఇక తెలుగు యువత కూడా అదే పరిస్థితి. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీరామ్ ను నియమించారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఈ యువనేత తొలినాళ్లలో చేసిన హడావిడి ఇప్పుడు కన్పించడం లేదు. తెలుగు రైతు అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి ఉన్నారు. ఆయన వాయిస్ పార్టీలో పెద్దగా విన్పించదు. రైతు సమస్యలపై అనేక నిరసన కార్యక్రమాలను పార్టీ చేపట్టినా తెలుగు రైతు సంఘం యాక్టివిటీ ఎక్కడా కన్పించకపోవడం విశేషం. ఇక తెలుగు విద్యార్థి విషయం చెప్పనక్కర లేదు. అది ఉందా? లేదా? అన్న డౌటు పార్టీ నేతలకే కలుగుతుంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నేతలు ఏ కార్యక్రమం చేయాలన్నా

అనుబంధ పార్టీ నేతలు, కార్యవర్గం తరలి వచ్చేది. దాదాపు నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న పార్టీ కావడంతో గ్రామ స్థాయిలో పార్టీకి క్యాడర్ బలంగా ఉండేది. కానీ ఇప్పుడు బయట నుంచి కూలీకి తీసుకురావాల్సి వస్తుందని టీడీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ కార్యక్రమం చేపట్టినా పట్టుమని పది మంది రాకపోవడానికి కారణం పార్టీ అనుబంధ సంఘాలు బలహీనంగా ఉండటమేనన్న వాదన పార్టీలో విన్పిస్తుంది. ఈ అనుబంధ సంఘాలను బలోపేతం చేయడానికి చంద్రబాబు ఇప్పటి వరకూ ఎలాంటి ప్రయత్నం చేయలేదు. నేతలనే నమ్ముకున్నారు. ఇప్పటికైనా అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలన్న సూచనలు విన్పిస్తున్నాయి.

# ఎమ్మెల్యే వర్సెస్ మాజీ మంత్రి

రాజమండ్రి, ఫిబ్రవరి 10, (న్యూస్ పల్స్)వారిద్దరూ మిత్రులు కాదు. అలా అని శత్రువులు కారు. ఒకరు అధికారపార్టీ అని చెప్పుకొంటున్న ఎమ్మెల్యే. ఇంకొకరు టీడీపీ నేత. అకస్మాతుగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం మొదలైంది. దెప్పిపొడుపు మాటలతో తమలోని కళను బయటపెడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా కోనసీమలోని రాజోలు రాజకీయాలు ఒక్కసారిగా వాడీవేడిగా మారిపోయాయి. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మధ్య ఒక్కసారిగా మాటల యుద్ధం మొదలైంది. రాపాక జనసేన నుంచి గెలిచి.. ప్రస్తుతం అధికార వైసీపీకి చేరువయ్యారు. గొల్లపల్లి టీడీపీ నేత. ఎప్పుడూ కనీసం పార్టీలపై విమర్శలు చేసుకోని ఈ ఇద్దరు నాయకులకు ఏమైందో ఏమో.. ఒకరినొకరు దూషించుకోవడం మొదలుపెట్టారు.టీడీపీ సమావేశంలో పాల్గొన్న గొల్లపల్లి.. ఎమ్మెల్యే రాపాకపై విరుచుకుపడ్డారు. రిపబ్లిక్ డే సందర్భంగా రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడిని జాతీయ జెండా ఎగరేయకుండా అడ్డుకున్నారని ఎమ్మెల్యే రాపాకపై ఫైర్ అయ్యారు గొల్లపల్లి. ఈ విమర్శలకు రాపాక సైతం ఘాటుగానే స్పందించారు. అలా మొదలైన మాటల తూటాలు రాజోలు రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. ఒకరు ప్రస్తుతం జరుగుతున్న అవినీతిని బయటపెడితే.. మరొకరు గతంలో జరిగిన అక్రమాలను వెలుగులోకి తెస్తున్నారు. ఇద్దరు నాయకులు ప్రస్తావిస్తున్న ఆ అంశాలే ప్రస్తుతం ఆసక్తికర చర్చగా మారాయి.ఎమ్మెల్యే రాపాక 70 కోట్లతో ఇల్లు కట్టుకుంటున్నారని ఆరోపించిన గొల్లపల్లి.. నిర్మాణం కోసం ఇసుక, ఐరన్ ఎక్కడి నుంచి బలవంతంగా తీసుకొచ్చారో తనకు తెలుసన్నారు. ఆ పేర్లను మాత్రం బయటపెట్టబోనని ట్విస్ట్ ఇచ్చారు. జనసేన నుంచి గెలిచి.. కాళ్ల పారాణి ఆరక ముందే వైసీపీలో చేరిన రాపాక.. రాజోలును ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు మాజీ మంత్రి. గతంలో తాను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలోనే అభివృద్ధి జరిగిందని తెలిపారాయన. చివరకు రాపాక సొంతూరు చింతలమోరిలోని ఆయన ఇంటికి కూడా తానే రోడ్డు వేయించానని కామెంట్ చేశారు గొల్లపల్లి. గతంలో మల్కిపురంలో రాపాక పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కారని.. అప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోలీసులతో మాట్లాడి కేసు లేకుండా చేశారని గొల్లపల్లి ఆరోపించారు.గొల్లపల్లి విమర్శలు.. ఆరోపణలతో ఉలిక్కిపడిన ఎమ్మెల్యే రాపాక.. వెంటనే కౌంటర్లు మొదలుపెట్టారు. ఎమ్మెల్యేగా రాజోలులో గొల్లపల్లి ఇసుక దోపిడీ చేశారని.. రోడ్ల పనులు, ప్రభుత్వ ఉద్యోగుల పోస్టింగ్‌లలో ప్రతిదానికీ రేటుకట్టి వసూలు చేసేవారని ఆరోపించారు రాపాక. ఏ నియోజకవర్గంలోనూ గొల్లపల్లి రెండోసారి గెలిచిన దాఖలు లేవని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఒక నియోజకవర్గమంటూ లేని నేతగా మాజీ మంత్రిని కార్నర్ చేశారు రాపాక. తన పేకాట వ్యవహారాలను ప్రస్తావించటంపై మండిపడిన ఆయన.. విస్తుపోయే విషయాలనూ బయటపెట్టారు. గతంలో గొల్లపల్లి సూర్యారావు పేకాట ఆడేందుకు రావులపాలెం నుంచి రాజోలుకు వచ్చేవారనీ? తనతో పేకాడిన సందర్భాల్లో ఓడిపోతే డబ్బులు కూడా ఇచ్చేవారు కాదనీ సంచలనం రేపారు రాపాక. ఈ ఆరోపణలు.. కౌంటర్లు చూశాక.. రాజోలులో ప్రస్తుతం పేకాటపై రకరకాలుగా చర్చించుకుంటున్నారు.ఇద్దరి మాటల్లో వాస్తవాలు ఎలా ఉన్నా.. రాపాక, గొల్లపల్లి ఇద్దరూ పొలిటికల్ మైలేజ్ కోసం ప్రయత్నిస్తూ పరువు తీసుకుంటున్నారని అనుచరులు చర్చించుకుంటున్నారట. ఇద్దరి మధ్య విభేదాలు లేకపోయినా.. ఒక్కసారిగా వ్యక్తిగత విమర్శలు చేసుకోవడం.. అవి శ్రుతిమించడం చూశాక.. రానున్న రోజుల్లో ఇంకేం బయటపెడతారో అనే ఉత్కంఠ రాజోలు జనాల్లో ఉందట.

# టిక్కెట్ ధరలు పెంపునకు ఓకే

విజయవాడ, ఫిబ్రవరి 10, (న్యూస్ పల్స్)టాలీవుడ్‌కు గుడ్ న్యూస్. సినిమాల థియేటర్లలో టికెట్ల రేట్లు పెంచితేనే బెటర్ అన్నది ఏపీ ప్రభుత్వం వేసిన కమిటీ ఇచ్చిన రిపోర్ట్. ఈ రిపోర్ట్ ప్రకారమే త్వరలో థియేటర్లలో రేట్ల పెంపు ఉండబోతోంది. అవును, కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం చూస్తే మల్టీప్లెక్స్ టికెట్ల రేట్లలో పెద్దగా తేడాల్లేవుగానీ.. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామపంచాయతీల్లో ఉన్న థియేటర్లలో టికెట్ల రేట్లు మాత్రం పెరగాలన్నదే సారాంశం. ఆ రిపోర్ట్ ప్రకారం.. ప్రాంతం ఏదైనా సరే, నాన్ ఏసీ థియేటర్లు ఎక్కడున్నా సరే కనీస టికెట్ ధర 30 రూపాయలు ఉండాలి. జీవో నెంబర్ 35 ప్రకారం అది కేవలం 5 రూపాయలే. అంటే ఇప్పుడు కమిటీ రిపోర్ట్ ప్రకారం 25రూపాయలు అదనం అవ్వబోతోంది. అలాగే నాన్‌ఏసీల్లో గరిష్టంగా ఉన్న 15 రూపాయల టికెట్‌ను.. 70 రూపాయలకు పెంచాలని రిపోర్ట్ ఇచ్చింది.ఇక ఏసీ సినిమా హాళ్ల విషయానికొస్తే.. ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 35 ప్రకారం గ్రామపంచాయతీలైతే కనిష్టంగా 10, గరిష్టంగా 20 రూపాయలుంది. అదే నగర పంచాయతీల్లో కనిష్టంగా 15, గరిష్టంగా 35, మున్సిపాలిటీల్లో తక్కువగా 40, ప్రీమియం టికెట్ రేట్ 100 ఉంది. ఈ రేట్లు సవరించాలని కమిటీ చెప్పిన లెక్కల ప్రకారం ఏసీ థియేటర్‌లో మినిమమ్ 40 రూపాయలు ఉండాలి. అత్యధికంగా 150 రూపాయలు పెంచుకునేలా పర్మిషన్ ఇవ్వాలి. అంటే.. ఏసీ థియేటర్లలో ఇన్నాళ్లూ అత్యధికం అనుకున్నది ఇప్పుడు కనిష్ట రేటుగా మారబోతోంది. ఇక మల్టీప్లెక్సుల విషయానికొస్తే.. టాప్ టు బాటమ్ ఒకటే టికెట్ కాకుండా.. కచ్చితంగా ప్రీమియం, డీలక్స్, ఎకానమీ క్లాస్‌లు ఉండాలన్నది కమిటీ చెప్పిన మాట. మల్టిప్లెక్సుల్లో ఇప్పటికే జీవో ప్రకారం అత్యధిక ధర 250 రూపాయల వరకూ ఉంది.ఇక కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌లో రెండు కీలక అంశాలున్నాయి. జీవో నెంబర్ నెంబర్ 35 ప్రకారం థియేటర్లను మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామపంచాయతీలుగా విభజించారు. కానీ కమిటీ మాత్రం ఈ బేధాలు వద్దని సలహా ఇచ్చింది. అంటే హాల్ ఉండే ప్రాంతాన్ని బట్టి ప్రాపర్టీ ట్యాక్స్‌లో హెచ్చుతగ్గులు ఉండొచ్చుగానీ.. టికెట్ రేట్లు మాత్రం ఏసీనా, నాన్‌ఏసీనా, మల్టిప్లెక్సా అన్న దానితోనే ముడిపడి ఉంటుంది

# అమాత్య....మీరెక్కడా....

కాకినాడ, ఫిబ్రవరి 10, (న్యూస్ పల్స్)పినిపే విశ్వరూప్. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి. మంత్రి పదవి చేపట్టి రెండున్నరేళ్లు దాటుతున్నా ఆయన పెద్దగా ఫోకస్ కాలేదు. ఆయనకు ఫోకస్ అయ్యే ఉద్దేశ్యం లేనట్లే కన్పిస్తుంది. అమలాపురం, రాజోలు శాసనసభ నియోజకవర్గాలకే ఆయన మంత్రి అన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఈయనకు మంత్రి పదవి కొత్తేమీ కాదు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య, నల్లపురెడ్డి ప్రసన్న కుమారెడ్డి క్యాబినెట్ లో పనిచేసిన అనుభవం ఉంది. వివాదాలకు దూరంగా... అయినా పినిపే విశ్వరూప్ ఈ రెండున్నరేళ్లలో ఇటు వివాదాలకు కాని, అటు ఆరోపణలకు కాని లోను కాలేదు. ఆయనకు వాస్తవంగా రాజోలు నియోజకవర్గంపైనే ఎక్కువ మక్కువ. అందుకే ఆయన రాజోలు రాజకీయాల్లో వేలు పెడుతున్నారంటారు. కానీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఎప్పుడూ సమీక్ష జరిపిన పాపాన పోలేదు. ప్రభుత్వంలోనూ ఏదో అంటీ ముంటనట్లుగా వ్యవహరిస్తారు

## ఏపీకి ఎన్టీపీసీ విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయవాడ, ఫిబ్రవరి 10,ఆంధ్రప్రదేశ్ లోని డిస్కంలు కేంద్రం సంస్థ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ కి 450 కోట్ల రూపాయల బకాయి పడ్డాయి. ఆ బకాయిలు చెల్లించాలంటూ ఇంతవరకు పదే పదే అడిగినా పట్టించుకోలేదు. చివరికి ఓ 30 కోట్లయినా చెల్లించాలని కోరింది. అయినా దున్నపోతు మీద వాన కురిసిన చందంగా వ్యవహరించాయి. దీంతో ఏపీకి విద్యుత్ సరఫరాను ఎన్టీపీసీ నిలిపేసింది. అప్పటికీ డిస్కంలకు కానీ, జగన్ రెడ్డి సర్కార్ కు కానీ దోమ కుట్టినట్లు కూడా లేకపోయింది. ఏపీలో విద్యుత్ కోతలు అమలు చేసింది. ఎన్టీపీసీకి పూర్తి బకాయిలు చెల్లించాలనే సోయి లేకుండా వ్యవహరిస్తోంది జగన్ రెడ్డి సర్కార్. దీంతో ఎన్టీపీసీ డైరెక్ట్ గా రంగంలోకి దిగింది. తమకు పడిన బకాయి మొత్తం చెల్లించకపోతే దివాళా సంస్థలుగా డిస్కంలను ప్రకటిస్తామంటూ హెచ్చరించింది. ఫిబ్రవరి 20 లోగా మిగతా 450 కోట్ల బకాయి చెల్లించాలి.. లేదంటే ఆర్బీఐకి లేఖ రాస్తామని, దివాళా తీసినట్లు ప్రకటించాలని కోరతాం అంటూ డిస్కంల మెడపై కత్తి పెట్టింది ఎన్టీపీసీ.అనాలోచిత నిర్ణయాలు, అవగాహన లేని విధానాలతో తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయింది ఏపీ సర్కార్. ఉత్పాదక రంగంపై కాకుండా రాజకీయ స్వార్థంతో ఖజానాలోని సొమ్మంతా కొందరికి అప్పనంగా దోచిపెట్టింది. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. పూర్తిగా పలు సంస్థలకు బకాయిలు పడింది. ఈ క్రమంలోనేపెద్ద మొత్తంలో ఎన్టీపీసీకి కూడా బకాయి పడింది. బకాయిలు చెల్లించకుండా మొండికేసిన ఏపీ డిస్కమ్ లపై ఎన్టీపీసీ కన్నెర్ర చేసింది. తమ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్ కు సంబంధించి సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో వాటిని దివాళా తీసిన సంస్థలుగా ప్రకటింపజేస్తామని తాజాగాహెచ్చరించింది వాస్తవానికి డబ్బులు చెల్లించనందుకు ఇటీవల ఏపీకి రెండ్రోల పాటు ఎన్టీపీసీ ఆకస్మికంగా విద్యుత్ పంపిణీని నిలిపివేసింది. అంతటితో సరిపెట్టకుండా 2020లో కేంద్రం తీసుకొచ్చిన చట్టం మేరకు చర్యలు తీసుకోవాలని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)కి లేఖ రాస్తామని హెచ్చరిస్తూ వరుసగా లేఖలు రాసింది.ఇదే జరిగితే ఏపీ డిస్కమ్ లకు బహిరంగ మార్కెట్లో కూడా కరెంటు దొరకదు. పవర్ ఎక్స్ఛేంజీలోనూ కొనుగోలు చేసేందుకు ఆస్కారం ఉండదు. దీంతో రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారి సత్యనారాయణ ఎన్టీపీసీ యాజమాన్యంతో హడావుడిగా సంప్రదింపులు జరిపారు. ఎన్టీపీసీకి 3 వందల 30 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించింది. మరో 4 వందల 50 కోట్లను ఈ నెల 20వ తేదీలోగా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో ఎన్టీపీసీ మెత్తబడి ఏపీకి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించింది. కానీ 20వ తేదీలోగా మొత్తం బకాయిలు చెల్లించకపోతే.. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపేయడమే కాకుండా.. డిస్కమ్ లు దివాళా తీసినట్లు ప్రకటించాలని కోరుతూ ఆర్బీఐకి లేఖ రాస్తామని హెచ్చరించింది.2020 నాటి చట్టం ప్రకారం కేంద్రంలోని ఇంధన సంస్థలకు బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించాలి. అదేవిధంగా సోలార్, పవన విద్యుత్ సంస్థలకూ ఎప్పటికప్పుడు డిస్కమ్ లు బిల్లులు చెల్లించాలి. అలా చెల్లించకపోతే వాటిని దివాళా తీసినట్లుగా ప్రకటిస్తారనేది ఇక్కడ గమనించాల్సిన అంశం.

## అక్రమమైనింగ్ అడ్డుకున్న ధూళిపాళ్ల



గుంటూరు, ఫిబ్రవరి 10 అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర గుంటూరు జిల్లాలోని సుద్దపల్లి క్వారీల దగ్గర ఆందోళన చేపట్టారు. అక్రమ మైనింగ్‌పై అధికారులు స్పందించాలంటూ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సుద్దపల్లి క్వారీల దగ్గర ధూళిపాళ్ల బైఠాయించారు. ఆయనకు మద్దతుగా టీడీపీ శ్రేణులు సైతం తరలివచ్చారు. ఈ క్రమంలో సుద్దపల్లి క్వారీల వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సుద్దపల్లి క్వారీ గుంతల వద్ద ధూళిపాళ్ల చేపట్టిన దీక్ష వద్దకు వచ్చిన మైనింగ్ అధికారులు రాత్రి చేరుకున్నారు. తహశీల్దార్ ఎన్ఓసి ఇవ్వడం వల్లే మైనింగ్‌కు అనుమతి ఇచ్చామని అధికారులు ధూళిపాళ్లకు తెలిపారు. అయితే.. అధికారుల తీరుతో రాత్రంతా క్వారీలలోనే దీక్ష కొనసాగిస్తున్నాని ధూళిపాళ్ల అక్కడే బైఠాయించారు. మైనింగ్ ఏడి వచ్చి అక్రమ మైనింగ్‌పై కొలతలు తీయాలని.. అప్పటివరకు ఇక్కడి నుంచి వెళ్లేదిలేదని ధూళిపాళ్ల పేర్కొన్నారు.వైసీపీ ప్రభుత్వంలో ప్రతి పనిలో అక్రమాలు జరుగుతున్నాయని ధూళిపాళ్ల పేర్కొన్నారు. సుద్దపల్లి క్వారీలలో కూడా నాడు ? నేడు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంత అక్రమ మైనింగ్ జరిగిందో లెక్క తేల్చాలన్నారు. ఈ క్రమంలో ధూళిపాళ్ల ఆందోళన చేస్తున్న సుద్దపల్లి క్వారీ వద్దకు పోలీసులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆందోళన విరమించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఆందోళన విరమించకుంటే అరెస్ట్ చేసే అవకాశముందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సుద్దపల్లి క్వారీల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## రాత్రికి రాత్రే కోటీశ్వరులు

ఇటానగర్, ఫిబ్రవరి 10 అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఇక్కడ జరిగిన కార్యక్రమంలో నివాసి వ్యక్తికి పరిహారం చెక్కును అందజేశారు . అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లా బొమ్జా గ్రామానికి చెందిన 31 కుటుంబాలు ఒక్క రోజులో కోటీశ్వరులు అయ్యాయి. ముఖ్యమంత్రి పెమా ఖండూ జారీ చేసిన పరిహారం చెక్కు కీలకమైన లొకేషన్ ప్లానింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం భారత సైన్యం తమ భూమిని స్వాధీనం చేసుకున్న ఐదేళ్ల తర్వాత, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ కుటుంబాలకు బుధవారం పరిహారం చెక్కులను అందజేశారు . చైనా సరిహద్దు జిల్లాలో తవాంగ్ గారిసన్ 200 ఎకరాల భూమిని సేకరించింది. మొత్తం రూ.40.80 కోట్లను రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఇది పంపిణీ చేయబడిందిఓ కార్యక్రమంలో 29 కుటుంబాలకు రూ.1.09 కోట్ల చెక్కులను పెమా ఖండూ అందజేశారు. ఒక కుటుంబానికి రూ.6.73 కోట్లు, మరో కుటుంబానికి రూ.2.45 కోట్లు పరిహారం అందింది. ఈ మొత్తాన్ని విడుదల చేసినందుకు రక్షణ మంత్రికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.సైన్యం స్వాధీనం చేసుకున్న ఇతర ప్రైవేట్ భూములకు పరిహారం త్వరలో అందజేస్తామని చెప్పారు.అరుణాచల్ ప్రదేశ్‌లో ఆర్మీ స్వాధీనం చేసుకున్న ప్రైవేట్ భూమికి పరిహారంగా రూ.158 కోట్ల రాయితీని మంజూరు చేస్తూ కేంద్రం గతేడాది సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. బుధవారం పంపిణీ చేసిన మొత్తం ఆ పరిహారం ప్యాకేజీలో భాగమే.

# ఇంకా కొలిక్కిరాని జలవివాదాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10, తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలు ఇంకా కొలిక్కిరాలేదు. వీటికి సంబధించి కేంద్రంలోని బీజేపీ సర్కారు గెజిట్ విడుదల చేసి మిన్నకుండిపోయింది. వేగంగా సమస్యలను పరిష్కరించే ఉద్దేశం కేంద్రానికి ఉన్నట్టు కనిపించడం లేదు. రకరకాల నిబంధనల పేరుతో తాత్సారం చేస్తున్నది. ఆరు నెలల దాటినా ఈ అంశంలో ఆశించిన వేగం లేదు. ప్రగతి అంతకన్నా లేదు. దీంతో సాగునీటి సమస్యల పరిష్కారం తీవ్ర ఆలస్యమవుతున్నది. ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కిలా తయారైంది. అపెక్స్ కౌన్సిల్ సమావేశాల నిర్వహణ లేకపోవడంతో వివాదాలు దీర్ఘకాలికంగా కొనసాగుతూనే ఉన్నాయి. జాప్యం మూలంగా సమస్యల పరిష్కారం మరింత జఠిలమయ్యే ప్రమాదముంది. 2014లో యూపీఏ తెచ్చిన పునర్విభజన చట్టాన్ని అమలుచేయడం లేదు. దీంతో వివాదాలు ఎటూ తేలడం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సాగునీటి పథకాలు, వాటి అనుబంధ కాంపొనెంట్లకు సంబంధించి జులై 15న కేంద్ర జలశక్తి శాఖ జారిచేసిన గెజిట్ నోటిఫికేషన్ రెండు రాష్ట్రాల్లోనూ వివాదాస్పదమైంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ), గోదావరి నదీ యాజమన్య బోర్డు(జీఆర్ఎంబీ) పరిధిలోకి రెండు రాష్ట్రాల ప్రాజెక్టులు తీసుకురావాలని కేంద్రం ఆదేశాలిచ్చింది. అయితే ఆ గెజిట్‌పై రెండు రాష్ట్రాలకు అభ్యంతరాలు ఉన్నాయి. గెజిట్‌ను అమలుచేస్తే ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ, కేంద్రం మాత్రం గెజిట్‌ను అమలుచేయాల్సిందేనని కేంద్రం పట్టుబడుతున్నది. అంతేగాక మరిన్ని షరతులు పెట్టింది. వాటిపైనా తెలుగు రాష్ట్రాలు ససేమిరా అంటున్నాయి. సమన్యను పరిష్కరించమంటే నిబంధనలు, మార్గదర్శకాల పేరుతో కేంద్రం కొత్త సమస్యలను సృష్టిస్తున్నదనే విమర్శలు అంటున్నాయి. ఇప్పటికే రెండు బోర్డులు ఇరురాష్ట్రాల్లో పర్యటించాయి. ప్రాజెక్టులను స్వయంగా పరిశీలించాయి. సబ్‌కమిటీలతోనూ భేటి అయ్యాయి. సమాచారం తీసుకున్నాయి. బోర్డుల పరిధిలో సమస్య కొలిక్కివచ్చే అవకాశం కనిపించకపోవడంతో అపెక్స్ కౌన్సిల్ భేటి తప్పనిసరని తెలంగాణ సాగునీటిపారుదల, ఆయకట్టు శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. జీఆర్ఎంబీ పరిధిలో ఎలాంటి వివాదాలు లేకున్నా ప్రాజెక్టులు అప్పగించాలనడంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగానే ఆక్షేపించింది. అయినా కేంద్రం ససేమిరా అనడంతో ఆ బోర్డు పరిధిలోని ప్రాజెక్టులను అప్పగించడానికి సిద్ధమైంది. అలాగే కేఆర్ఎంబీ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించేందుకు అభ్యంతరం లేదని చెబుతున్నది. కాగా గెజిట్ నోటిఫికేషన్ వచ్చిన ఐదు నెలల తర్వాత డిసెంబరు 28న రెండు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శుల భేటి ఆన్‌లైన్‌లో జరిగింది. అయినా సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. తాము కేంద్రం అడిగిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇస్తున్నామని రాష్ట్ర సాగునీటి శాఖ అధికారులు చెబుతుండగా, అడిగిన సమాచారం ఇవ్వడంలో ప్రభుత్వాల నుంచి సహకారం ఉండటం లేదని కేంద్రం చెబుతున్నది. అలాగే ఆయా ప్రాజెక్టుల వద్ద కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగాల(సీఐఎస్ఎఫ్)ను ఏర్పాటు చేయడం, రెండు బోర్డులకు రూ.200 కోట్ల చొప్పున సీడ్ మనీ డిపాజిట్ చేయడం, గెజిట్ షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని ప్రాజెక్టులను బోర్డుల పరిధిలోకి తీసుకురావాలనడం, సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లను సమర్పించాలంటూ చెబుతున్నది. డీపీఆర్‌లను రాష్ట్రాలు సమర్పించాయి. అసలే గత మూడేండ్ల ముందు నుంచే ఆర్థిక సంక్షోభం ఉండటంతో బోర్డులకు రూ. 200 కోట్ల చొప్పున కేటాయించడం కుదరదనే అభిప్రాయంతో రాష్ట్ర ప్రభుతం ఉంది. గెజిట్ అమలుతోపాటు వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధాన కార్యదర్శులు, కేంద్ర, రాష్ట్రాల జలవనరులు, సాగునీటి శాఖల ఉన్నతాధికారులు అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది. ఈమేరకు ఇరు రాష్ట్రాలను సమన్వయం చేసి అపెక్స్ కౌన్సిల్‌ను నిర్వహించడంలో కేంద్రం విఫలమవుతున్నది.

# పథకం ప్రకారమే వివాహిత హత్య



మచిలీపట్నం మచిలీపట్నంలో ఈనెల 7వ తేదీన జరిగిన నాగమల్లేశ్వరి హత్య పథకం ప్రకారమే జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. భార్య భర్తల మధ్య ఏర్పడిన విభేదాలే హత్యకు గల కారణనీగా తేల్చి చెప్పారు. విలేఖరుల సమావేశంలో సీఐ అంకబాబు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నం గాంధీనగర్కు చెందిన ధవళేశ్వరం సత్యనారాయణ, చిల్లర శ్రీనివాస్ రావులు స్నేహితులు. వడ్డీ వ్యాపారం లో స్నేహితులు ఇద్దరు భాగస్వాములు. స్నేహం అడ్డం పెట్టుకొని శ్రీనివాసరావు భార్య నాగమల్లేశ్వరి తో సత్యనారాయణ అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. గత ఏడాది కరోనా కారణంగా శ్రీనివాస రావు మరణించాడు. శ్రీనివాస రావు మరణించడంతో నాగమల్లేశ్వరి పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. తాను పెళ్లి చేసుకుంటానని నాగమల్లేశ్వరి కుటుంబ పెద్దల తో మాట్లాడి ఆమెను తిరిగి మచిలీపట్నంకు తెచ్చుకున్నాడు. ఈడేపల్లి లోని ఓ అపార్ట్మెంట్ లో ఇద్దరూ కాపురం పెట్టారు. కొన్ని నెలలుగా ఇరువురి మధ్య కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. నాగమల్లేశ్వరని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న సత్యనారాయణ, ఈనెల ఏడో తేదీన అన్నంలో కొంగల మనీదు కలిపి హత్య చేసేందుకు పూనుకున్నాడు. భోజనంలో కొంగల మనీదు కలపడంతో పాటు మొహంపై పిడిగుద్దులు గుద్ది గొంతు నులిమి హత్య చేసాడు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు నాగమల్లేశ్వరి బంధువులకు ఫోన్ చేసి ఆమెకు ఫిట్స్ వచ్చాయంటూ చెప్పాడు. నాగమల్లేశ్వరి బంధువులు వచ్చే వరకు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తిప్పుతూ హై డ్రామా ఆడాడు. నాగమల్లేశ్వరి మొహంపై గాయాలను చూసి హత్య జరిగినట్లు అనుమానించిన బంధువులు, పోలీసులకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలియజేసారు. విషయం తెలుసుకుని పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బంధువుల నుంచి వివరాలు తీసుకుని కేసు నమోదు చేసారు. నాగమల్లేశ్వరి ని హత్య చేసిన సత్యనారాయణను గురువారం జడ్పీ సెంటర్ లో అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరాచారు.

# మళ్లి తెరమీదకు విశాఖ రాజధాని అంశం

అమరావతి ఫిబ్రవరి 10 మరోమారు విశాఖ రాజధాని అంశం తెరమీదకు వస్తోంది. విశాఖ శారదాపీఠాన్ని సందర్శించుకోవడానికి వచ్చిన జగన్ పనిలో పనిగా విశాఖ రాజధానికి ముహూర్తం ఖరారు చేయించుకున్నారు అని ప్రచారం జరుగుతోంది.దాని ప్రకారం చూస్తే మార్చి 4న విశాఖ రాజధానిగా ప్రకటించడానికి ప్రభుత్వం సర్వ సన్నద్ధంగా ఉందని అంటున్నారు. దానికి ముందు అంటే ఈ నెల చివర్లో ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలలో విశాఖ రాజధాని పేరిట బిల్లుని ప్రవేశపెడతారు అంటున్నారు. విశాఖను ఏకైక రాజధానిగా చేస్తారా లేక గతంలో మాదిరిగా మూడు రాజధానుల బిల్లు ఉంటుందా అన్నది అయితే తెలియదు. కానీ చూడబోతే విశాఖ మీదనే ఫోకస్ పెట్టి ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకునే ఈ బిల్లు రూపకల్పన చేస్తారు అంటున్నారు.ఇక విశాఖ రాజధాని ఆలోచనల నుంచి ప్రభుత్వం వెనక్కి పోవడం లేదని ఈ మధ్య తరచూ మంత్రులు చేస్తూ వస్తున్న ప్రకటనలు చెబుతున్నాయి. అదే టైమ్ లో విశాఖ రాజధానిగా చేసినా అమరావతి సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలను రూపకల్పన చెస్తారు అని అంటున్నారు. ఇలా విశాఖ రాజధానిగా చేయాలనుకుంటున్న జగన్ కి మంచి ముహూర్తం స్వామిజీ సూచించినట్లుగా చెబుతున్నారు.మరో వైపు చూస్తే జగన్ మంత్రి వర్గ విస్తరణకు ఈ నెల 18ని ముహూర్తంగా ఎంచుకున్నారు అని అంటున్నారు.

### మార్చి 4న విశాఖ రాజధానిగా ప్రకటించే అవకాశం ?

ఈ విషయాలు అన్నీ జగన్ స్వామి భేటీలో ప్రస్థావనకు రావడం జరిగింది అంటున్నారు. మరి టైమ్ చూస్తే తక్కువగా ఉంది. అయినా సరే జగన్ అనుకుంటే చెసేస్తారు కాబట్టి మంత్రి వర్గ విస్తరణకు కూడా ముహూర్తం స్వామి పెట్టి ఉంటారని కూడా అంటున్నారు.మంత్రుల విషయం వస్తే పనితీరు ఆధారంగా సీనియర్లతో పాటు కొందరిని కొనసాగిస్తూనే ఎక్కువ మందికి ఉద్వాసన పలికే వీలుందని అంటున్నారు. మొత్తానికి రానున్న రెండు మూడు వారాలూ చూసుకుంటే ఏపీ రాజకీయాల్లో అనేక కీలకమైన మార్లుపు సంభవించే అవకాశాలు అయితే ఉన్నాయని అంటున్నారు. ఇక బడ్జెట్ సమావేశాలో విశాఖ రాజధానితో పాటు కొత్త జిల్లాల విషయం కూడా ప్రస్థావనకు వస్తుంది అంటున్నారు. విశాఖ రాజధాని అన్నది ముఖ్యమంత్రి జగన్ మదిలో మెదిలో ఉన్న బలమైన ఆలోచన. ఆయన విశాఖను రాజధానిగా చూడాలని ముఖ్యమంత్రి అయిన తొలి ఆరు నెలలలోనే అనుకున్నారు. దాన్ని నాడే శాసనసభ సమావేశాల్లో బయటపెట్టారు. ఆ మీదట హడావుడిగా మూడు రాజధానుల బిల్లుని తయారుచేయించారు. ఇటు అసెంబ్లీలో మండలిలో ఆగమేఘాల మీద ఆమోదించారు.సరే దాని మీద కోర్టులో విచారణ కోసం పిటిషన్లు దాఖలు అయ్యాయి. తీరా విచారణ జరుతున్న సమయాన ప్రభుత్వం దాన్ని సడెన్ గా విరమించుకుంది.

# గిరిజన యువకులు ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10 రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్పీ ఐశ్వర్య రాస్తోగి, ఐటిడిఏ ప్రాజెక్ట్ పీఓ ప్రవీణ్ ఆదిత్య ఆద్వర్యంలో గిరిజన యువకులకు శిక్షణ కార్యక్రమాన్ని సీఆర్పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ సతీష్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఎస్పీ ఐశ్వర్య రస్తోగీ మాట్లాడుతూ గిజన యువకులు సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే స్కిల్ డవలప్ మెంట్ ప్రోగ్రామ్ ను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని అన్నారు. సీఆర్పీఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లో భాగంగా మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన 40 మంది యువకులకు డ్రైవింగ్ లో 21 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం రాజమహేంద్రవరం లాలా చెరువు లోని సీఆర్పీఎఫ్ 42 బెటాలియన్ ప్రాంగణంలో అర్బన్ జిల్లా ఎస్పీ ఐశ్వర్యా రాస్తోగి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఐశ్వర్య రాస్తోగి మాట్లాడుతూ సీఆర్పీఎఫ్ 42, బెటాలియన్, ఎస్.బి మోటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ డవలప్మెంట్ ప్రోగ్రామ్ లో భాగంగా 21 రోజులు డ్రైవింగ్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం భవిషత్ లో గిరిజన యువకులకు ఉపాధి అవకాశాలు పొందేందుకు దోహదపడుతుందని అన్నారు. సీఆర్పీఎఫ్ 42 బెటాలియన్ కమాండెంట్ సతీష్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన యువకులకు స్కిల్ డవలప్ మెట్ లో భాగంగా కారు డ్రైవింగ్ లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ వలన యువకులు అసాంఘిక కార్యకలాపాల వైపు, మావోయిస్టుల వైపు మొగ్గు చూపకుండా ఉపాధి అవకాశాలు పెంపొందించుకొని జీవనోపాధి పొందేందుకు దోహద పడుతుందని అన్నారు. గత రెండు సంవత్సరాలు గా కోవిడ్ వలన స్కిల్ డవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించాలేదని అన్నారు. శిక్షణ అనంతరం బ్యాంక్ ద్వారా లోన్లు మంజూరు చేసిన వాహనాలు కొనుగోలు చేసి యువకులకు ఇచ్చేందుకు సహకరిస్తామన్నారు. సీఆర్పీఎఫ్ లో శిక్షణ పొందడం వలన యువకులలో నైపుణ్యం లభించడం తో పాటు క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ ప్రవీణ్ అదిత్య, ఎస్.ఎఫ్.ఎస్ అసిసెంట్ కన్వసర్వర్ ఎం.వి.ప్రసాదరావు, సెకండెంట్ కమాండెంట్ జి. సీతల్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ బి. రత్నమ్మ, స్టేట్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్. సురేష్ ప్రభు, మారుతి సుజికీ జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్.ఎస్.ఆర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పెరగ నున్న మొబైల్ ఛార్జీలు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 10 మొబైల్ ఫోన్ ఛార్జీలు (టారి ఫ్లు) ఈ సంవత్సరం మరింత పెరగనున్నాయి. మూడు నాలుగు నెలల తర్వాత పెంపు తప్పదని భారతీ ఎయిర్‌టెల్ ఎండీ, సీఈఓ గోపాల్ విఠల్ చెప్పారు. అనలిస్టుల సమావేశంలో ఆయన ఈ విషయం స్పష్టం చేశా రు. అవసరమైతే ఈ విషయంలో తామే ముందుగా ఛార్జీలు పెంచేందుకు వెనకాడేది లేదన్నారు. గత ఏడాది నవంబరులోనూ ఎయిర్‌టెల్ మిగతా కంపెనీల కంటే ముందుగా టెలికం ఛార్జీలు 18 నుంచి 25 శాతం వరకు పెంచింది.

## విద్యార్థి సంఘాల అందోళన

### పలు ప్రాంతాల్లో పోలీసుల మోహరింపు

కాకినాడ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విద్యార్థి సంఘులు కలక్టరేట్ ల ముట్టడి, ధర్నా కార్యక్రమాలకు సిద్ధమైన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ అందోళన కార్యక్రమాలకు ఎటువంటి అనుమతులు లేవని అధికారులు అంటున్నారు. , తూర్పుగోదావరి జిల్లా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలలో చెక్ పోస్టులను, పీకెట్ లను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా కార్యక్రమాల్లో పాల్గొనకుండా సంబంధిత పోలీసు అధికారులు వారివారి పరిధిలో కళాశాలలో ట్రైనింగ్ సెంటర్లు విద్యా సంస్థలలో, ఆర్టీసీ బస్ స్టాప్ లు, రైల్వే స్టేషన్ల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి అనుమతి లేని చట్టవ్యతిరేక ధర్నా కార్యక్రమాలలో పాల్గొనకుండా చర్యలు చేపడుతున్నారు.ముందస్తు భద్రత చర్యలలో భాగంగా కాకినాడ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు.

## పని దినాల్లో రాకండి ముఖ్యమంత్రి గారూ..... బిజెపి

విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి విశాఖ పర్యటన రాత్రి 9గం. నుంచి ఉదయం 7గం. లోపు మాత్రమే పెట్టుకోవాలని, లేదంటే ఆదివారం రోజు అయినా రావాలని వర్కింగ్ డేస్ లో అస్సలు విశాఖ రావద్దని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు కుమార్ రాజు తెలిపారు. బీజేపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి విశాఖ పర్యటన వలన స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ లో నిర్మాణం చేసిన వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రారంభం చేయడానికి ముఖ్యమంత్రి కి సమయం వుండటం లేదు అని ఎద్దేవా చేశారు. పది రోజుల లో దేవస్థానం ప్రారంభోత్సవానికి ముహూర్తం పెట్టకపోతే బీజేపీ ఆధ్వర్యంలో తామే ప్రారంభోత్సవం చేస్తామని పది రోజుల గడువు అంటు అల్టిమేటం జారీ చేశారు. పోలీసులు పక్షపాతం గా వ్యవహరించడం సరి కాదన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీ ల నేతలందరినీ సమాన దృష్టి తో చూడాలన్నారు. వియం ఆర్ డి ఏ ఫ్లాట్ లు అమ్మకం విషయం లో స్థానిక ప్రజల కు ఇబ్బందులు వుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు.

## గంజాయి మత్తులో యువకుల హల్ చల్

### పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి

గుంటూరు గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం జొన్నలగడ్డ వద్ద పెట్రోల్ బంకులో అర్ధరాత్రి నలుగురు యువకులు వీరంగం సృష్టించారు. సేల్స్ మెన్ పై విచక్షణా రహితంగా దాడి జరిపారు. అడ్డొచ్చిన మరో సేల్స్ మెన్ ని చితకబాదారు. ఇరువురిపై దాడికి పాల్పడి సెల్ ఫోన్, 10 వేలు నగదును లాక్కెళ్లారు. యువకులు గంజాయి మత్తులో ఉన్నారని బాధిత సేల్స్ మెన్ లు ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

## నేతలకు తొత్తులుగా అధికారులు

### పుట్టా సుధాకర్ యాదవ్

ప్రొద్దుటూరు అధికార స్థానిక నాయకులు మా కార్యకర్తలను రకరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అధికార నాయకులకు చెబుతున్న అంతకంత మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ నేత పుట్టా సుధాకర్ యాదవ్ ఆరోపించారు. అధికారులు నాయకుడికి తొత్తులుగా మారి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. అధికారులకు చెప్తున్నా, మీరు అంత కు అంతా ఇబ్బంది ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రొద్దుటూరు మండలంలో భూఆక్రమణ ఎక్కువగా జరుగుతుంది. రాబోవు మా ప్రభుత్వం లో ప్రతి ఎకరా చట్టపరంగా వెనక్కి తెప్పిస్తా. వందలాది ఎకరాల ఆక్రమించుకున్న వారు ఎంతటి వారైనా సరే వదిలే ప్రసక్తే లేదు. మండలంలో దళితులు అధిక సంఖ్యలో ఉన్నారు రాబోవు మా ప్రభుత్వంలో ప్రతి దళిత కుటుంబానికి భూమి ఇప్పిస్తా. మా నాయకుడు చంద్రబాబు నాయుడు తో మాట్లాడి ఎస్సీ ఎస్టీలకు శాశ్విత పట్టాలు ఇప్పిస్తాను. బ్రహ్మంగారి మఠం అభివృద్ధి న్యాయ పరంగా జరుగుతూ ఉంటే నేను కూడా సహకరిస్తా. వన్ టైం సెటిల్మెంట్ రిజిస్ట్రేషన్ పై ముఖ్యమంత్రి ఫోటో ఏంటి. ఉద్యోగస్తులకు పిఆర్సి తగ్గించడం ఎక్కడా చూడలేదని అన్నారు.రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది. రైతులకు కరెంటు కోత ఏర్పడింది. అదేవిధంగా ట్రాన్స్ఫర్ ఆలు ఇవ్వటంలేదు. రకరకాల మద్యం బ్యాండ్లు అమ్ముతూ కమిషన్లు లాగుతున్నాడు. షేవింగ్ షాప్ లో ఉన్న ఫోన్ పే లో పేటీఎం లో మద్యం షాప్ లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.

## టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

అమరావతి ఆంధ్రప్రదేశ్ పదో తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ గురువారం విడుదలైంది. టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూలను మంత్రులు ఆదిమూలపు సురేష్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విడుదల చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్:మార్చి 11 నుంచి 31 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు, ఏప్రిల్ 8 నుండి 28 వరకు ఇంటర్మీడియట్ బోర్డు పరిక్షలు జరుగుతాయని ఏపి విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. 1456 సెంటర్లలో ఈ పరిక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి సంవత్సరం 5,05,052 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 4,81,481 విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. మొత్తం 9,86,533 మంది విద్యార్థులు ఈ పరిక్షలు రాయనున్నారని తెలిపారు.పదో తరగతి పరిక్షల షెడ్యూల్:టెన్త్ పరీక్షల తేదీలను మంత్రి ఆదిమూలపు సురేష్ విడుదల చేశారు. 2022 సంవత్సరం మే 2 నుంచి మే13 వరకు పదో తరగతి పరిక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మొత్తం 6,39,805 మంది విద్యార్థులు పదోతరగతి పరిక్షలు రాయనున్నారని తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అస్వస్థత

నెల్లూరు జిల్లాలోని పొదలకూరులోని కాకాణి రమణారెడ్డి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం భోజనం, పాలు, గుడ్డు తిన్న చిన్నారులు కడుపు నొప్పి వాంతులు, విరోచనాలతో అల్లాడుతున్నారు. కలుషిత ఆహారం తినడం వల్లే అస్వస్థతకు గురయ్యారంటూ అంగన్ వాడీ కేంద్రం ముందు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. విషయం తెలిసిన వెంటనే ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శకుంతల, భాగ్య లక్ష్మీ, మహిళా పోలీసు విజయలక్ష్మి అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అంగన్ వాడీ కార్యకర్త అమరావతి, ఆయా రమీజా నుంచి వివరాల సేకరించారు. అస్వస్థతకు గురైన చిన్నారులను పొదలకూరు నుండి నెల్లూరులోని పలు వైద్యశాలకు హుటాహుటిన తరలించారు.

# గ్రామ రెవెన్యూ సేవకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**రికవరీ చేసిన డి.ఏ లను జమచేయాలి**

**సి ఐ టి యూ**

డోన్ ( విభారె) గ్రామ రెవెన్యూ సహాయకులకు కనీస వేతనం 21 వేల రూపాయలు ఇవ్వాలని,నామినీలను వీఆర్ఏలు నియమించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపు ఈ నెల 8నుంచి 22వరకు జరుగు రిలే దీక్షలను పట్టణంలోని స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ముందు జరుగుతున్న 4 వ రోజు రిలే నిరాహార దీక్షలను సి ఐ టీ యు మండల కార్యదర్శి రామాంజనేయులు పూలమాలలు వేసి ప్రారంభించడం జరిగింది.ఈ దీక్షలకు భారత ప్రజాతంత్ర మహిళ సమాఖ్య(ఐద్వా)జిల్లా ఉపాధ్యక్షురాలు యస్. షేమిమ్ బేగం సంపూర్ణ మద్దతు తెలియజేశారు,అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రామాంజనేయులు , షేమిమ్ బేగం మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల కనీస వేతనం 21 వేల రూపాయలు ఇవ్వాలని డీఏ తో కలిపి వేతనాలు చెల్లించాలని, 65 సంవత్సరాలు నిండి చనిపోయిన వారి కుటుంబీకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు తెలిపారు, రాష్ట్రవ్యాప్తంగా 22 వేల మంది వివో లు పనిచేస్తున్నారని అధికారంలోకి రాకముందు పాదయాత్రలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు రు ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వివో ల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వన్ సెవెన్ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు గ్రామ రెవెన్యూ సహాయకులు 10,500 రూపాయల వేతనంతో వారి కుటుంబాల జీవనం చాలా అగమ్యగోచరంగా తయారైంది అని నేడు ఆకాశాన్నంటుతున్న ధరలు చూస్తుంటే వారి కుటుంబాల జీవితాలు చీకటిలో ముక్కుతూ రెవెన్యూ వ్యవస్థను జరుగుతున్నటువంటి గ్రామ రెవెన్యూ సహాయకుల జీవితాలను ఆదుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉన్నదని వారన్నారు పక్కడ ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకుల 30 శాతం వేతనాలు పెంచిందని వారు గుర్తు చేశారు కానీ కానీ ఇక్కడ ఉన్నటువంటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చినటువంటి డీ ఏ లను రికవరీ చేయడం చాలా దుర్మార్గమైన రాష్ట్ర హైకోర్టు చెప్పిన విధంగా డి ఏ రికవరీ నిలిపివేసి ఇంత వరకు రికవరీ చేసిన డి ఏ వారి వేతనాల్లో జమ చేయాలని వారు కోరారు అనేక సందర్భాలు గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మంత్రులకు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని గత్యంతరం లేకనే ఈ ప్రభుత్వానికి గ్రామ రెవెన్యూ సహాయకుల సత్తా చూపాడానికి సమ్మె నిర్వహిస్తున్నామని ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని లేనియెడల దశాలవారి ఆందోళనలతో భాగంగా వచ్చే నెల1,2,3 జిల్లా కలెక్టరేట్ ముందు నిర్వహిస్తామని,అప్పటికి పరిష్కరించకుంటే అన్ని ప్రజా సంఘాలు సమీకరించి పెద్ద ఎత్తున మార్చి10న చలో విజయవాడ చేపడతామని వారు హెచ్చరించారు. దీక్షలో కూర్చున్నవారు నాయుడు,మధు నాయుడు,రంగస్వామి, సురేంద్ర, విజయ్ భాస్కర్, ఈ కార్యక్రమంలో నక్కి శ్రీకాంత్, తెలుగు విజయ్, గ్రామ రెవెన్యూ సహాయకులు రామచంద్రుడు,పుల్లన్న, నగరత్నమ్మ,సుంకన్న, శివశంకర్ వరప్రసాద్, రామచంద్రుడు,ఓబులేష్, శివశంకర్ నాయుడు,తదితరులు పాల్గొన్నారు

# నిరుద్యోగ సమస్యలపై పరిష్కారం అడిగితే అక్రమ అరెస్టులా!!

**జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప**

కౌతాళం ( విభారె) నిరుద్యోగ సమస్యలపై పరిష్కారం చేయమని అడిగితే అక్రమ అరెస్టులు చేయడం తెలుగు యువత కార్యదర్శిలను స్థానిక పోలీసు స్టేషన్లు లో నిర్బంధించడం చాలా దారుణం అని ఇది హేయమైన చర్య అని తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప మండిపడ్డారు. తెలుగు యువత కార్యదర్శి లను నాయకులను అక్రమ అరెస్టులతో చేయడంతో స్థానిక నివాసంలో జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యపై అన్ని విద్యార్థి సంఘాలు తెలుగు యువత కార్యదర్శులు ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందని కానీ ప్రభుత్వం నిరుద్యోగులకు అక్రమ అరెస్టు కు చేయడం ఎంతవరకు సమంజసమని దేశంలో నిరుద్యోగ సమస్య అడుగడుగున పెరిగిపోయిందని పరిశ్రమలు పెట్టుబడులు లేక అప్పుల ఊబిలో కూరుకుపోయిందని నిరుద్యోగుల పై అక్రమ అరెస్టులు కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ౯, 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాల పంపిణీ

డోన్ :జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట డోన్ నందు భుదవారం 9, 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. 9,10వ తరగతి పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవడానికి విద్యార్థుల కెరీర్ గైడెన్స్ చక్కగా ఉపయోగపడుతుందని, ప్రతి విద్యార్థి చైల్డ్ ఐడి నెంబర్ తో లాగిన్ అయ్యి, మీకు కావలసిన సమాచారాన్ని పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.సుమారు 555 కెరీర్ లు, 21000 కాలేజీ లు, 1150 ఎంట్రెన్స్ పరీక్ష లు, 1200 స్కాలర్షిప్ల సమాచారం ఉందన్నారు. ఈ లాగిన్ ద్వారా విద్యార్థులకు మోటివేషన్, భవిష్యత్తు, పథకాలు, ఉద్యోగాలు, ఉన్నత విద్య, విజన్, ప్రాజెక్టు నిర్మాణం, తదితర అంశాలపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్ గౌడ్ వెంకట రమణ,లక్మయ్య,అల్లీపీరా, రాధ, వెంకట లక్ష్మీ, దేవేంద్రప్ప, భారతి బాయి, ముని రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో అసలైన ఓటర్లు గల్లంతు...

కడప ఫిబ్రవరి 10 ( విభారె) : కడప, టీడీపీ జిల్లా కార్యాలయంలో ఈరోజు జరిగిన పత్రిక సమావేశంలో కడప నగర టీడీపీ అధ్యక్షులు, సానపురెడ్డి శివకొండారెడ్డి మాట్లాడుతూ...కడప నగరంలోని ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉందని మండిపడ్డారుఅధికార పార్టీ కనుసన్నలలో అధికారులు చేతివాటం ప్రదర్శించి, స్వామి భక్తి ప్రదర్శించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.అధికారపక్షం ఏకపక్షంగా అధికార యంత్రంగాన్ని వాడుకొని ఇష్టానుసారంగా ఓటర్లను అయోమయ పరిస్థితుల్లో పడేసి తమ పబ్బం గడుపుకుంటున్నారని వైసీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.ఒకే కుటుంబంలోని వారిని ఒక ప్రాంతంలోని వారిని ఇంకోకొక ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ వారికి బూతులు కేటాయించి, ఓటర్లను ఇబ్బందికి గురిచేస్తోందని మండిపడ్డారు.టీడీపీ సానుపభూతిపరుల ఓట్లను తొలగించి... ఆ డివిజన్ కు సంబంధంలేని కొత్త వారిని ఓటర్ల జాబితాలో చేర్చి టీడీపీని దెబ్బతీయలని వైసీపీ కుటిల రాజకీయాలకు తెరలేపిందని విమర్శించారు.ఓటరు జాబితా తయారు చేసే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిజమైన ఓటర్లను గుర్తించి... ఓటరు కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేయాలని టీడీపీ తరపున డిమాండ్ చేస్తున్నాము. లేనిపక్షంలో న్యాయపరంగా ఎలా సాధించుకోవాలో అలా సాధించుకుంటామని వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ సమావేశంలో కడప పార్లమెంట్ కార్యదర్శి మాసా కోదండ రామ్, కడప నగర తెలుగు మహిళ అధ్యక్షురాలు సునీత, కడప పార్లమెంట్ టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, కడప జిల్లా టీడీపీ నాయకులు నబికోట శ్రీనివాసులు, కడప ఒకటవ డివిజన్ టీడీపీ ఇంచార్జ్ మురికినాటి రామాంజనేయులు పాల్గొన్నారు.

# అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు:: కాంగ్రెస్



**అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు**

**నిరుద్యోగ సమస్యలు పరిష్కరించమని అడిగే వారిపై అక్రమ నిర్బంధాలు సరైనవి కావు**

**నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం.**

**కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా డిసిసి అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్**

కర్నూలు ఫిబ్రవరి 10 ( విభారె) ఉద్యోగ విరమణ వయస్సు పెంచమని ఉద్యోగ సంఘాలు చేయని డిమాండ్ ను ప్రభుత్వం ఇవ్వని హామిని నెరవేర్చడంలో అంతర్యం ఏమిటో ప్రభుత్వం నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి? జాబ్ క్యాలెండర్ ఎటు పోయింది? ప్రభుత్వం మాటలు నమ్మి ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ కోచింగ్ సెంటర్లలో గడిపి ఉద్యోగ విరమణ వయసు పెంచడంతో నోటిఫికేషన్లు రావని మనస్థాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న నిరుద్యోగుల మరణాలకు కారకులెవరు ఎవరు అని ప్రశ్నించారు? చేతికందిన బిడ్డలను పోగొట్టుకుంటున్న కుటుంబాల పరిస్థితి ఏంటి? బాధ్యులెవరుఅని ప్రశ్నించారు లక్ష్మి నరసింహ యాదవ్ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి జరిగిన ప్రయత్నాలు ఏమిటి? రాష్టానికి తీసుకొచ్చిన పరిశ్రమలు ఎన్ని?ప్రస్తుతం ఉన్న ఆరోగ్య పరిస్థితుల్లో మానవుని సాధారణ జీవన ప్రమాణం 60 సంవత్సరాలుగా నిర్దేశించుకున్న ఈ రోజుల్లో ఉద్యోగ విరమణ వయస్సును 58 సంవత్సరాలకు తగ్గించే ఆలోచన ప్రభుత్వం చేయకుండా ఉద్యోగ విరమణ సమయంలో ఉద్యోగస్తులకు వచ్చే సొమ్మును ప్రభుత్వం చెల్లించలేక 62 సంవత్సరాలకు పెంచడం చాలా దారుణమైన విషయం ఈ విషయంపై ప్రభుత్వం పునః సమీక్షించి 58 సంవత్సరాల కు తగ్గించాలి అక్రమ అరెస్టులు నిర్బంధాల ద్వారా ఉద్యమం మరింత బలపడుతుంది తప్ప ప్రభుత్వానికి ఒరిగే ప్రయోజనం ఉండదు ఇప్పటికైనా నిరుద్యోగుల సమస్యలను గుర్తించి ఉద్యోగ విరమణ వయసు 58 సంవత్సరాలకు తగ్గించి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వా శాఖల్లో ఖాళీగా ఉద్యోగాలకు ఉద్యోగ నియామకాలు తక్షణమే చేపట్టాలని లక్ష్మి నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్షులు పఠాన్ అబీబ్ఖాన్ కాంగ్రెసు పార్టీ నాయకులు సంధ్య వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# నూతన విద్యా విధానం రద్దు చేయాలి

కర్నూలు ఫిబ్రవరి 10 నూతన విద్యా విధానం రద్దు చేయాలని ,కేంద్ర బడ్జెట్లో ఐ.సి.డి.ఎస్ కు కేటాయింపులు పెంచాలని, అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 రూపాయలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షల రూపాయలు చెల్లించాలని తదితర డిమాండ్ సాధనకై రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కర్నూల్ అర్బన్ సి.డి.పి.ఓ .ఆఫీస్ దగ్గర ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు యూనియన్ నాయకురాలు విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్. పి.నిర్మల. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి అంజి బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐ.సి.డి.ఎస్ కు తగిన నిధులు కేటాయించలేదని ఐసిడిఎస్ కు బడ్జెట్ లో కేటాయింపులు పెంచాలని అంగన్వాడి ఉద్యోగులను ( రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు . ప్రక్క రాష్ట్ర మైన తెలంగాణలో 30% వేతనాలు పెంచారని అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఐదు లక్షలు ఇస్తామని ప్రకటించడం జరిగిందని తెలంగాణ రాష్ట్రం ప్రకటించినట్టుగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు

# పూరి జనగణమన స్టోరీ లైన్ ఇదే

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతున్న 'లైగర్' సినిమా షూటింగ్ పూర్తి అయ్యింది. కరోనా వల్ల దాదాపుగా రెండేళ్ల పాటు సాగిన లైగర్ కు ఇటీవలే గుమ్మడి కాయ కొట్టేసినట్లుగా స్వయంగా పూరి జగన్నాద్ ప్రకటించాడు. అదే సమయంలో ఇక జనగణమన అంటూ అధికారికంగా ప్రకటించాడు. గత కొన్ని రోజులుగా పూరి జగన్నాథ్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన జనగణమన ను విజయ్ దేవరకొండతో తెరకెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు.. పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా ఈ సినిమా ఉంటుంది అంటూ వార్తలు వచ్చాయి.ఆ వార్తలు నిజమే అన్నట్లుగా లైగర్ షూటింగ్ పూర్తి అయినట్లుగా ప్రకటించిన సమయంలో పూరి జగన్నాద్ ప్రకటన ఉంది. ఖచ్చితంగా పూరి చేయబోతున్న ఆ జనగణమన విజయ్ దేవరకొండ తోనే అంటూ ప్రతి ఒక్కరు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఆ సినిమాకు సంబంధించిన స్టోరీ లైన్ చర్చనీయాంశంగా మారింది.జనగణమన సినిమా కథ ను మహేష్ బాబుతో చేసేందుకు పూరి రాసుకున్నాడు. మూడు నాలుగు సంవత్సరాల క్రితమే ఒక పోస్టర్ ను విడుదల చేశాడు. దాంతో మహేష్ బాబుకు ఒక మంచి సినిమా పడబోతుంది అంటూ అంతా అనుకున్నారు. కాని అనూహ్యంగా మహేష్ బాబు తో జనగణమన కాకుండా విజయ్ దేవరకొండతో తెరకెక్కించేందుకు పూరి సిద్దం అయ్యాడని తేలిపోయింది. పాన్ ఇండియా రేంజ్ లో రూపొందబోతున్న ఈ సినిమా టైటిల్ చూస్తేనే ఇది ఒక దేశ భక్తి సినిమా అని క్లారిటీ వచ్చింది.ఈ సినిమా లో దేశ భక్తితో పాటు పూరి మార్క్ కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయని అంటున్నారు. ఈ సినిమా లో విజయ్ దేవరకొండ ఒక సోల్జర్ గా కనిపించబోతున్నట్లుగా తాజా పుకార్లు షికార్లు చేస్తున్నాయి.ఇండస్ట్రీ వర్గాలు మరియు సోషల్ మీడియా ప్రచారం ప్రకారం ఈ సినిమా స్టోరీ లైన్... ఒక రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకు పోయి ప్రజలు ఇబ్బంది పడుతున్న సమయంలో పరిపాలకు పూర్తిగా విఫలం అయ్యి.. సమాజంలో అసమానతలు తొలగించడంలో నాయకులు విఫలం అవ్వగా.. సామాన్యుల హక్కులు కాలరాస్తున్న సమయంలో ఆర్మీ రంగంలోకి దిగితే ఎలా ఉంటుంది.. ఆర్మీ ఆఫీసర్ ఆ రాష్ట్రంలో తీసుకు వచ్చిన మార్పు ఏంటీ.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఏంటీ అనేది కథ అన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.ఈ స్టోరీ లైన్ లో నిజం ఎంతో కాని ఇదే కనుక నిజం అయితే అభిమానులకు పండుగే అనడంలో సందేహం లేదు. తెలుగు లోనే కాకుండా ప్రతి ఒక్క భాషలో కూడా ఈ సినిమా ఆడుతుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. లైగర్ ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేయబోతున్నారు కనుక వచ్చే ఏడాది వరకు ఈ జనగణమన కోసం వెయిట్ చేయాల్సిందే.




# సల్మాన్ మూవీలో విక్టరీ వెంకటేశ్!

వెంకటేశ్ ను ఒకసారి గమనిస్తే తాను స్టార్ ప్రొడ్యూసర్ తనయుడినని .. స్టార్ హీరోనని బిగదీసుకుని కూర్చోవడం ఎప్పుడూ ఎక్కడా కూడా కనిపించదు. ఇన్నేళ్ల కెరియర్లో ఎన్నో సినిమాలు చేసిన ఆయన ఇంతకాలంగా ఇక్కడ పొడించిందేమీ లేదని ఒక వేదికపై అనడం ఆయన సింప్లి సిటీకి నిదర్శనం. కథ బాగుంటే రీమేకులు చేయడానికీ .. మల్టీ స్టారర్లు చేయడానికి ఆయన ఎప్పుడూ కూడా వెనుకాడరు. టాలీవుడ్ స్టార్ హీరోలతో ఆయన ఎంత ఫ్రెండ్లీగా ఉంటారో .. ఇతర భాషల్లోని హీరోలతోను అదే ఫ్రెండ్షిప్ ను కొనసాగిస్తూ ఉంటారు.బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ తో వెంకీకి మంచి సాన్నిహిత్యం ఉంది. అందువల్లనే ఆయన సినిమాలో వెంకటేశ్ ఒక కీలకమైన రోల్ చేయనున్నట్టుగా చెబుతున్నారు. బాలీవుడ్ లో సల్మాన్ హీరోగా ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాద్వాలా 'కభీ ఈద్ కభీ దివాళీ' అనే ఒక సినిమాను ప్లాన్ చేశాడు.సల్మాన్ సరసన నాయికగా పూజ హెగ్డేను తీసుకున్నారు. ఆ సినిమాకి సంబంధించిన అగ్రిమెంట్ పై ఆమె సైన్ చేసింది కూడా. అయితే కొన్ని కారణాల వలన ఈ ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. దాంతో ఈ సినిమా ఆగిపోయిందనే అంతా అనుకున్నారు.కానీ ఈ సినిమా ఆగిపోలేదట .. కరోనాతో పాటు కొన్ని ఇతర కారణాల వలన ప్రాజెక్టు ఆలస్యమైందట అంతే. అయితే ఈ గ్యాపులో ఈ సినిమా టైటిల్ ను మార్చేశారట. కొత్త టైటిల్ గా 'భాయ్ జాన్' ను సెట్ చేసినట్టుగా తెలుస్తోంది. మార్చి 15 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని చెబుతున్నారు. ఫ్యామిలీ డ్రామా జోనర్లో ఈ సినిమా రూపొందనుందని అంటున్నారు. ఈ సినిమా లోనే ఒక కీలక పాత్రలో వెంకటేశ్ సందడి చేయనున్నారన్న మాట.'నారప్ప' .. 'దృశ్యం' రీమేకులతో హిట్లు కొట్టేసిన వెంకటేశ్ తన తాజా చిత్రంగా 'ఎఫ్ 3' సినిమా చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ముగింపు దశకి చేరుకుంది. ఏప్రిల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# అర గంటలో ఆరు పాటలు కంపోజ్ చేసిన దేవిశ్రీ..!

ప్రస్తుతం టాలీవుడ్ లో ఉన్న స్టార్ మ్యూజిక్ కంపోజర్స్ లో రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఒకరు. తెలుగు తమిళ భాషల్లో రెండు దశాబ్దాలుగా నంబర్ వన్ మ్యూజిక్ డైరెక్టర్ గా కొనసాగారు. కాకపోతే గత కొన్నేళ్లుగా డీఎస్పీ హవా తగ్గిపోయిందనే కామెంట్స్ వస్తున్నాయి. ముఖ్యంగా ఎస్ ఎస్ థమన్ ఆధిపత్యం మొదలైన తర్వాత దేవిశ్రీ రేసులో కాస్త వెనకబడిపోయారు. అయితే ఇటీవల వచ్చిన 'పుష్ప: ది రైజ్' సినిమాతో మరోసారి డీఎస్పీ గురించి అందరూ మాట్లాడుకులేనా చేసింది. ప్రస్తుతం దేవీ మ్యూజిక్ అందిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్స్ లో 'ఖిలాడీ' ఒకటి.మాస్ మహారాజా రవితేజ – డైరెక్టర్ రమేష్ వర్మ కాంబినేషన్ లో తెరకెక్కిన తాజా చిత్రం "ఖిలాడి". జయంతి లాల్ గడ సమర్పణలో కోనేరు సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 11న తెలుగు హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఈ మూవీ కోసం దేవిశ్రీ ప్రసాద్ సమకూర్చిన ఐదు పాటలు ఇప్పటికే బయటకు వచ్చాయి.అయితే పాటలు ఆశించిన స్థాయిలో లేవనే కామెంట్స్ వచ్చాయి. టేకింగ్ వల్ల యూట్యూబ్ లో మిలియన్ల వ్యూస్ వల్ల వచ్చాయే కానీ.. పాటలు వినడానికి సోసోగా ఉన్నాయనే అన్నారు. అయితే తాజాగా దర్శకుడు రమేష్ వర్మ ఓ ఇంటర్వ్యూలో 'ఖిలాడీ' పాటల గురించి దేవిశ్రీ గురించి మాట్లాడారు."దేవిశ్రీ ప్రసాద్ నాకు 15 ఏళ్ళ నుంచి తెలుసు. కథ చెప్పడానికి వెళ్ళినప్పుడు స్నేహితులం కాబట్టి సాయంత్రం 6 గంటల నుంచి అవీ ఇవీ ఆ మాట ఈ మాట చెప్పుకుంటూ ఉన్నాం. మిడ్ నైట్ 2 గంటలకు కథ చెప్పండి అన్నాడు. కథ చెప్పడం పూర్తయ్యేసరికి మూడున్నర నాలుగు గంటలు అయింది. అప్పటికప్పుడు మొదలుపెట్టి అర గంటలో అన్ని పాటలు ఇచ్చేసాడు. అర్థ గంటలో ఆరు ట్యూన్స్ ఇచ్చాడు. అప్పుడే ట్యూన్స్ అన్నీ ఓకే అనుకున్నాం. తర్వాత పాటలు రికార్డ్ చేసి పంపించారు. ఆరు పాటలు ఇచ్చాడు కానీ.. సినిమాలో ఐదో పెట్టుకున్నాం. అన్నీ చార్ట్ బస్టర్ అయ్యాయి" అని రమేష్ వర్మ చెప్పుకొచ్చారు.దేవిశ్రీ పాటల గురించి రమేష్ వర్మ గొప్పగానే అర గంటలోనే ఆరు పాటలు ఇచ్చారని చెప్పారు కానీ.. నెటిజన్స్ మాత్రం అంత తక్కువ టైములో కంపోజ్ చేసారు కాబట్టే అవుట్ ఫుట్ అలా మాములుగా వచ్చిందని కామెంట్స్ చేస్తున్నారు. డీఎస్పీ మరింత శ్రద్ధ సమయం పెట్టి పని చేసినట్లే అదిరిపోయే ట్యూన్స్ వచ్చేవి కదా అని అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# 18 నెలల్లో టీమిండియాలోకి వస్తా..



అండర్-19 ప్రపంచకప్‌లో యంగ్ ఇండియాను జగజ్జేతగా నిలబెట్టి, రాత్రికిరాత్రి హీరోగా మారిపోయిన యశ్ ధుల్.. టీమిండియాలో చోటు సంపాదించేందుకు తనకు తాను టార్గెట్‌ను సెట్ చేసుకున్నానని తెలిపాడు. మరో 18 నెలల్లో టీమిండియాకు తప్పక ఆడతానని ధీమా వ్యక్తం చేశాడు. ఒకవేళ టార్గెట్‌ను రీచ్ కాని పక్షంలో మరింతగా శ్రమిస్తానని, భారత జట్టులో స్థానం సంపాదించడం కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నానని, ఇందుకు తన కుటుంబ సభ్యులు కూడా ప్రిపేరై ఉన్నారని వెల్లడించాడు. ఢిల్లీ రంజీ జట్టు నుంచి పిలుపు అందుకున్న అనంతరం ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ధుల్ ఈ విషయాలను ప్రస్తావించాడు. టీమిండియా స్టార్ ఆటగాడు, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లిని అమితంగా ఆరాధిస్తానని, అతని అనువనువును రెగ్యులర్‌గా ఫాలో అవుతానని చెప్పిన ధుల్.. కోహ్లి తరహాలోనే తన కెరీర్‌ను ప్లాన్ చేసుకుంటానని తెలిపాడు. ప్రపంచకప్ విజయానంతరం తనపై పెరిగిన అంచనాల దృష్ట్యా ఒత్తిడికి లోనవుతారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించదలచుకోలేదని, దొరికిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, లక్ష్యం దిశగా సాగడంపైనే తన దృష్టంతా ఉందని చెప్పుకొచ్చాడు. ప్రపంచకప్ గెలిచాక కోహ్లితో ఓసారి మాట్లాడానని, అతను తన అండర్-19 ప్రపంచకప్ అనుభవాలను తనతో పంచుకున్నాడని చెప్పాడు. వరల్డ్ కప్ విజయానంతరం సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించుకుని మంగళవారం స్వదేశానికి చేరుకున్నామని, సొంతగడ్డపై అడుగుపెట్టిన నాటి నుంచి రెస్ట్ లేకుండా తిరుగుతున్నానని, కొద్ది రోజులు విరామం తీసుకుని రంజీ ప్రాక్టీస్‌లో పాల్గొంటానని ఈ సందర్భంగా పేర్కొన్నాడు. కాగా, ఢిల్లీ నుంచి విరాట్ కోహ్లి, ఉన్ముక్త్ చంద్‌ల తర్వాత భారత అండర్-19 జట్టును విశ్వవిజేతగా నిలిపిన కెప్టెన్‌గా యశ్ ధుల్ రికార్డుల్లోకెక్కిన విషయం తెలిసిందే. వీరిలో కోహ్లి కెరీర్‌లో అత్యున్నత శిఖరాలను అధిరోహించగా, ఉన్ముక్త్ చంద్ మాత్రం ఆశించిన ప్రదర్శన కనబర్చలేక కనుమరుగైపోయాడు.

## మ్యాచ్ ఓడిపోయుండొచ్చు.. అతని వికెట్‌తో కల నెరవేరింది

వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను టీమిండియా ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో టీమిండియా బ్యాటింగ్‌లో కొందరు క్లిక్ అయితే.. మరికొందరు విఫలమయ్యారు. ఈ మధ్యనే అన్ని ఫార్మాట్ల నుంచి కెప్టెన్‌గా పక్కకు తప్పుకున్న కోహ్లి విండీస్‌తో రెండు వన్డేల్లోనూ విఫలమయ్యాడు. తొలి వన్డేలో 8 పరుగులు చేసిన కోహ్లి.. రెండో వన్డేలో 18 పరుగులు చేసి ఔటయ్యాడు. కాగా రెండో వన్డేలో విండీస్ తరపున రీఎంట్రీ ఇచ్చిన ఓడియన్ స్మిత్ బౌలింగ్‌లోనే కోహ్లి వెనుదిరిగాడు. కోహ్లి వికెట్‌తో పాటు కీలకమైన పంత్ వికెట్‌ను కూడా స్మిత్ తన ఖాతాలో వేసుకున్నాడు.ఓవరాల్‌గా మ్యాచ్‌లో ఏడు ఓవర్లు వేసిన ఓడియన్ స్మిత్ 29 పరుగులిచ్చి రెండు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో స్మిత్ కోహ్లి వికెట్ తీయడంపై ట్విటర్ ద్వారా స్పందించాడు. ' వరల్డ్ బెస్ట్ బ్యాట్స్‌మన్ అయిన కోహ్లి వికెట్ తీయడం నాకు కలగా ఉండేది. నిన్నటి మ్యాచ్‌తో అది నెరవేరింది.' అని చెప్పుకొచ్చాడు. ఇక శుక్రవారం జరగనున్న మూడో వన్డేకు టీమిండియా జట్టులో పలు మార్పులు ఉండే అవకాశం ఉంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190